J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 42 సంచిక : 35 03.02.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# కంచు కోటలో వలసల బాట!



ఫిబ్రవరి 2వ తేదీ గురువారం సాయంత్రం తాడేపల్లిలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో ఆదాల ప్రభాకర్‌రెడ్డికి నెల్లూరురూరల్ బాధ్యతలు అప్పజెప్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా పార్టీ సమన్వయకర్త బాలినేని శ్రీనివాసరెడ్డి

- నిన్న ఆనం.. నేడు కోటంరెడ్డి... రేపు...???
- స్వరం పెంచిన మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి
- రూరల్ ఇన్‌ఛార్జ్‌గా ఆదాల ప్రభాకర్‌రెడ్డి



"ఆంధ్రప్రదేశ్ శాసనసభ సభ్యుడిగా దైవ సాక్షిగా మరియు నా ఆరాధ్య నాయకుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సాక్షిగా ప్రమాణం చేస్తున్నాను"... శాసనసభలో ప్రమాణస్వీకారం సమయంలో నిబంధనలను కూడా పక్కనపెట్టి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్న మాటలు ఇవి. అప్పట్లో ఇలా ప్రమాణం చేసినందుకు ఆయన మళ్ళీ రెండవసారి కూడా ప్రమాణం చేయాల్సి వచ్చింది. "నా తుదిశ్వాస వరకు జగన్‌మోహన్‌రెడ్డిని వదిలిపెట్టి వెళ్ళే ప్రసక్తేలేదు. నేను ఎప్పుడు మరణించినా నా భౌతిక దేహాన్ని చూడడానికి జగన్‌మోహన్‌రెడ్డి గారు ముఖ్యమంత్రి హోదాలో రావాలన్నది నా కోరిక"... పలు సందర్భాలలో శ్రీధర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇవి. ఇప్పుడు అదే శ్రీధర్‌రెడ్డి వైసీపీకి గుడ్‌బై చెప్పేశారు. తన ఫోన్‌లు ట్యాప్ చేసి, తనని అవమానించారనే నింద పార్టీపైన వేసి, పార్టీ నుండి తప్పుకున్నారు.

ఇప్పటికే ఆనం రామనారాయణరెడ్డి చేస్తున్న కామెంట్లపైన, ఆయన పట్ల పార్టీ అధిష్టానం వ్యవహరిస్తున్న తీరుపట్ల అయోమయంలో ఉన్న పార్టీ శ్రేణులకు కోటంరెడ్డి సంఘటనతో మరో

3 లో

## సీతమ్మ సిత్రాలు!



తాజా బడ్జెట్‌పై ప్రముఖ చార్టెర్డ్ అకౌంటెంట్ చిన్ని శ్రావణ్‌కుమార్ విశ్లేషణ!

10లో...

## ఆరోగ్యమే మహాభాగ్యం – అదే కుటుంబ సౌభాగ్యం

### ఆత్మకూరు మండలం మురుగళ్ళ గ్రామంలో

# ఉచిత మెగా వైద్య శిబిరం



డాక్టర్ పి.రజనీకాంత్
M.S., MRCS, London, FEBS, France



డాక్టర్ పి.నీరజ
M.B.B.S., MRCPCH (U.K)

సాధారణ వ్యాధులు । ఆర్థోపెడిక్ । గైనకాలజి । కిడ్నీ । కార్డియాలజి న్యూరాలజి । ఊపిరితిత్తులు । గ్యాస్ట్రో & జనరల్ । చర్మవ్యాధులు । ఇఎన్‌టి లివర్ & గ్యాస్ట్రో । చిన్నపిల్లలు । వెన్నెముక । డయాబిటిస్ । డెంటల్

మనవాడు, మన జిల్లాలోని ఆత్మకూరు మండలం మురుగళ్ళ గ్రామ వాస్తవ్యుడు, కాలేయ మార్పిడిలో దేశంలోనే అగ్రగామిగా ఖ్యాతి గడించిన వైద్య ప్రముఖుడు, చెన్నైలోని గ్లెనిగల్స్ గ్లోబల్ హాస్పిటల్ లో సేవలందిస్తున్న ప్రతిభాశాలి
**డాక్టర్ పి.రజనీకాంత్**
చిన్నపిల్లల వైద్య విభాగంలో అగ్రగణ్యురాలైన
**డాక్టర్ పి.నీరజ గార్ల**
సారధ్యంలో.. శ్రీ వెంకటేశ్వర ప్రజా వైద్యశాల నిర్వాహకులు
**డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు గారి**
ఆధ్వర్యంలో అన్ని విభాగాలలో నిష్ణాతులైన వైద్యుల భాగస్వామ్యంతో
**ఫిబ్రవరి 5, 2023, ఆదివారం మురుగళ్ళ గ్రామంలో**
**ఉచిత మెగా వైద్య శిబిరం**
నిర్వహించబడుతోంది.



ఈ వైద్యశిబిరంలో ఉ॥ 9 గం.ల నుండి మ॥ 3 గం.ల వరకు అన్ని రకాల వైద్య పరీక్షలు జరిపి, అవసరమైన వారికి **ఉచిత రక్త పరీక్షలు** చేయడంతో పాటు **ఉచితంగా మందులు** కూడా అందజేస్తారు. ఆత్మకూరు పరిసర ప్రాంత ప్రజలు ఈ అపురూప అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుకుంటూ.......

ఆరోగ్యమే మహాభాగ్యం, అదే మన కుటుంబ సౌభాగ్యంగా భావించే...
మీ, శ్రేయోభిలాషి, సేవాభిలాషి



**కే.వి.రత్నం**
వ్యవస్థాపక ఛైర్మెన్
రత్నం విద్యా సంస్థలు

# మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగాలి

## - కేంద్రప్రభుత్వ క్షేత్రప్రచారాధికారి నాగసాయి సూరి



నాటి స్వాతంత్ర్య సమరయోధులు కలలుగన్న నవభారత నిర్మాణమే వారికి అందించే నిజమైన నివాళి అని కేంద్ర ప్రభుత్వ క్షేత్ర ప్రచార అధికారి పరవస్తు నాగసాయి సూరి తెలిపారు. జనవరి 30న మహాత్మా గాంధీజీ వర్ధంతి, అమరవీరుల సంస్మరణ దినోత్సవం, సర్వోదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని దక్కిలిలోని డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వశాఖ, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్,-నెల్లూరు ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. 'వందేమాతరం' అని పలకడమే నేరమైన రోజుల్లో తమ జీవితాలను సైతం త్యాగం చేసిన ఎంతోమంది మహనీయులు భావితరాల భవిష్యత్తు కోసం కలలు గన్నారని, సమాజంలోని ప్రతి ఒక్కరి అభివృద్ధి ద్వారానే వారికి నిజమైన నివాళులు అర్పించగలమని తెలిపారు. మనదేశం స్వరాజ్యం సముపార్జించుకుని 75ఏళ్ళు పూర్తిచేసుకున్న సందర్భంలో కేంద్ర ప్రభుత్వం ఆజాదీకా అమృత్ మహోత్సవాల పేరిట దేశవ్యాప్తంగా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోందని, వీటి వెనుక ప్రధాన ఆశయం నాటి స్వరాజ్య సమరయోధుల స్ఫూర్తిని ప్రతి ఒక్కరిలో కలిగించడమేనని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్‌పర్సన్ మాధవి మాట్లాడుతూ, వివక్షలు లేని సమాజాన్ని మహాత్ముడు కలలు గన్నారని... కుల, మత, ప్రాంత, లింగ వివక్షలకు తావులేని భారతదేశమే వారి స్మృతికి ఇచ్చే నిజమైన నివాళి అని తెలిపారు జడ్పీటీసీ రాజేశ్వరి, ఎంపీపీ రాజశేఖర్, మండల అభివృద్ధి అధికారి కరీముల్లా, మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు, ఆరోగ్య అధికారిణి డా. బిందు, సీడీపీఓ షంషద్ బేగం, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి పాల్గొన్నారు. తొలుత దక్కిలిలో స్వాతంత్ర్య అమృతోత్సవాల ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐ.సి.డి.ఎస్ ఆధ్వర్యంలో పోషకాహార ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. విద్యార్థినులకు రచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి బహుమతులందజేశారు. ఐ.సి.డి.ఎస్. కార్యకర్తలకు ఉత్తమ పోషకాహార బహుమతులను అందజేశారు.

## ఉదయగిరిలో..రహదారి భద్రతపై అవగాహన

ఉదయగిరి ఆర్టీసీ డిపో ఆవరణంలో జనవరి 27న జరిగిన రహదారి భద్రత అవగాహన సదస్సు కార్యక్రమంలో మేకపాటి గౌతమ్‌రెడ్డి అగ్రికల్చర్ యూనివర్శిటీ ప్రిన్సిపాల్ డాక్టర్ మనోజ్‌కుమార్‌రెడ్డి పాల్గొని ఆర్టీసీ డ్రైవర్లకు అవగాహన కలిగించారు. బస్సులు నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

## కుష్టువ్యాధిని నివారించాలి

జిల్లాలో కుష్టువ్యాధి నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు అధికారులను ఆదేశించారు. జనవరి 30న కలెక్టరేట్‌లో జరిగిన 'మహాత్మా గాంధీ వర్ధంతి - అమరవీరుల దినోత్సవం' సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కుష్టు వ్యాధి వ్యతిరేకదినాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, తొలుత జిల్లా కలెక్టర్ మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, జిల్లాలో కుష్టు వ్యాధి, క్షయ వ్యాధి నివారణకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు. జిల్లా క్షయ వ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్, జిల్లా వైద్యఆరోగ్య అధికారి డాక్టర్ పెంచలయ్య, జడ్పీ సీఇఓ చిరంజీవి, డిఆర్డిఏ పీడీ కె.సాంబశివారెడ్డి, ఐసిడిఎస్ పీడీ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

## గ్లెనిగల్స్ గ్లోబల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో..

# 5న..మురుగళ్ళలో ఉచిత వైద్యశిబిరం

చెన్నైలోని ప్రసిద్ధమైన గ్లెనిగల్స్ గ్లోబల్ ఆసుపత్రి, శ్రీ వేంకటేశ్వర ప్రజావైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ రజనీకాంత్‌ల సారధ్యంలో ఫిబ్రవరి 5న ఆత్మకూరు మండలంలోని మురుగళ్ళ గ్రామంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నారు.

ఈ శిబిరంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు (జనరల్), డాక్టర్ జె.ప్రణీత్ (ఆర్థో), డాక్టర్ ఎం.హారిక, (గైనకాలజీ), డాక్టర్ కె.ప్రవీణ్ (కిడ్నీవ్యాధుల నిపుణులు), డాక్టర్ కె.నాగేంద్రప్రసాద్ (కార్డియాలజీ), డాక్టర్ బి.వేణు (న్యూరాలజీ), డాక్టర్ వి.శ్రీనివాసన్ (ఊపిరితిత్తుల వ్యాధుల నిపుణులు), డాక్టర్ డి.మధుసూదన్ (గ్యాస్ట్రో-జనరల్), డాక్టర్ డి.రేణుక (చర్మవ్యాధులు), డాక్టర్ కె.ఎన్ ప్రతాప్ (ఇఎన్‌టి), డాక్టర్ పి.రజనీకాంత్ (లివర్-గ్యాస్ట్రో), డాక్టర్ ఫణికిరణ్ (వెన్నెముక వ్యాధుల నిపుణులు), డాక్టర్ ఆఫ్రిన్ (డయాబెటిస్), డాక్టర్ ప్రవళిక (ఎం.డి), చిన్నపిల్లల వ్యాధుల నిపుణులు డాక్టర్ పి.నీరజ, డాక్టర్ బి.రాంప్రసాద్, డాక్టర్ పి.కిరణ్, దంత వ్యాధుల నిపుణులు డాక్టర్ వెంకటేష్, డాక్టర్ కె.ప్రతిభ, డాక్టర్ పి.కల్యాణి పాల్గొని రోగులకు వైద్యపరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని నిర్వాహకులు తెలిపారు. ఆరోజున ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగే ఈ శిబిరంలో రోగులకు ఉచితంగా రక్తపరీక్షలు చేస్తారని, వివరాలకు 80086 08524 ఫోన్ నంబరుకు సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

# జాతీయ పరిశుభ్రతా దినోత్సవం



వీధులు, రోడ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్ల వంటి పబ్లిక్ స్థలాల్లో పరిశుభ్రత మెరుగుపరచాల్సిన అవసరం ఉన్నదని నెహ్రూ యువకేంద్ర జిల్లా అధికారి ఆకుల మహేంద్రరెడ్డి పేర్కొన్నారు. నెల్లూరులోని శ్రీరామరాజు చారిటబుల్ ట్రస్టు మరియు పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జనవరి 30న స్థానిక మూలపేటలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన 'జాతీయ పరిశుభ్రత దినోత్సవం'లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పరిసర ప్రాంతాలను శుభ్రం చేసి, విద్యార్థులకు అవగాహన కల్పించారు. శ్రీరామరాజు చారిటబుల్ ట్రస్టు సెక్రటరి కె.మురళీమోహన్‌రాజు మాట్లాడుతూ పరిశుభ్ర వాతావరణం వల్లనే ఎన్నో రోగాలు దూరమవుతాయన్నారు. అందరూ పరిశుభ్రతను పరిరక్షించాలని కోరారు. అనంతరం విద్యార్థులతో కలిసి స్కూల్ పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు యు.పద్మావతి, టి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్ ప్రత్యేక అధికారిగా..

## డిఆర్ఓ వెంకటనారాయణమ్మ

రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ప్రత్యేక అధికారిగా డిఆర్ఓ వెంకటనారాయణమ్మను నియమిస్తూ జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు తాజాగా ఉత్తర్వులిచ్చారు. రెడ్‌క్రాస్ పాలకవర్గ పదవీకాలం గడువు ఫిబ్రవరి 2వ తేదితో ముగిసింది.

ఈ నేపథ్యంలో కొత్త కమిటీని ఎన్నుకునేందుకు నెలరోజుల ముందుగానే సమావేశం జరగాల్సివున్నప్పటికీ, కారణాంతరాల వల్ల జరగకపోవడంతో, తిరిగి ఎన్నికలు జరిగేదాకా రెడ్‌క్రాస్ కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు, ఎన్నికలు నిర్వహించేందుకు ఇబ్బంది లేకుండా డిఆర్ఓను నియమించినట్లు సమాచారం.

# జడ్పీలో సమస్యల హోరు

## అభివృద్ధి పనులపై సుదీర్ఘంగా చర్చ

***జడ్పీ సమావేశంలో సమస్యలు మరోసారి హోరెత్తాయి. ఈ సందర్భంగా గ్రామాల్లో సమస్యలను జడ్పీటీసీలు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. తమ ప్రాంతాల్లో రోడ్లు బాగాలేక అవస్థగా ఉందని, ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఏడాదికిందట అభివృద్ధి పనుల కేటాయింపు జరిగినా, నేటికీ పలుచోట్ల పనులే ప్రారంభం కాలేదని వారు ఆందోళన వ్యక్తంచేశారు. దీంతో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆ సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటామని వారికి నచ్చజెప్పారు.***

నెల్లూరు జిల్లా జడ్పీ సర్వసభ్య సమావేశం జనవరి 27న నగరంలోని జడ్పీ సమావేశమందిరంలో జరిగింది. జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షత వహించారు. జడ్పీటీసీలు, ప్రజాప్రతినిధులు, ఎంపీపీలు పలు సమస్యలను చర్చించారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జేసీ కూర్మనాథ్‌లు పాల్గొని వారు చెప్పిన్న సమస్యల పట్ల స్పందిస్తూ, ఆ సమస్యల్ని టీనీ పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జడ్పీ ఛైర్‌పర్సన్ అరుణమ్మ మాట్లాడుతూ, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు సంక్షేమ పథకాలను చేరువచేయాలని, జిల్లాను ప్రగతిపథంలో నడిపించాలని సూచించారు. అనంతరం పలు శాఖల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను సమీక్షించారు. మండలస్థాయిల్లో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని, ఆసుపత్రి అభివృద్ధి కమిటీలు అసలున్నాయో లేవో అన్నట్లున్నాయని, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు సరిగా లేవని సభ్యులు చెప్పారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు జడ్పీ నిధులు కేటాయించినా, పలు ప్రాంతాల్లో ఆ పనులు ఇంకా ప్రారంభం కాలేదని, అనేక మండలాల్లో రోడ్లు దారుణంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జడ్పీ సభ్యులు పేర్కొన్న అన్ని రకాల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని మంత్రి కాకాణి వారికి చెప్పు, పనులు వెంటనే పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ బిల్లులు త్వరలో మంజూరుచేయించేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సులభంగా పాఠాలు అర్థమయ్యేలా ముద్రించిన 'విజయ దీపిక'లను ఆనం అరుణమ్మ, మంత్రి కాకాణి ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు బల్లి కల్యాణ్ చక్రవర్తి, విఠపు బాలసుబ్రహ్మణ్యం, వాకాటి నారాయణ రెడ్డి, గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్, డిసిసిబి ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ, జడ్పీ సిఇఓ చిరంజీవితో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.





## జడ్పీకి.. నల్లపరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పేరు

నెల్లూరు జడ్పీకి నల్లపరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పేరును పెట్టాలని జడ్పీ సమావేశంలో తీర్మానించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఇది సముచిత నిర్ణయం కూడా. జడ్పీ ఛైర్మన్‌గా ఆయన హయాంలో జిల్లాలో అనేక అభివృద్ధి పనులు వెల్లువెత్తాయి. దివంగత మంత్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి సోదరుడైన చంద్రశేఖర్‌రెడ్డి 1962 నుంచి 1970 దాకా జడ్పీ ఛైర్పర్సన్‌గా ఉంటూ జిల్లాకు ఎనలేని సేవలందించారు. 1983లో వెంకటగిరి శాసనసభ్యునిగా కూడా ఉన్నారు. స్వతహాగా రాజనీతిజ్ఞుడైన చంద్రశేఖర్‌రెడ్డి జడ్పీ ద్వారా ప్రజలకు చేసిన సేవలు అపారం. పంచాయతిరాజ్ ఛేంబర్ అధ్యక్షునిగా కూడా ఉంటూ ఆ పదవికే వన్నెతెచ్చే రీతిలో పని చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో మంచిపేరు తెచ్చుకుని, రాష్ట్ర రాజకీయరంగంలో నల్లపరెడ్ల కీర్తిని ఇనుమడింపజేసి ప్రజాబాంధవుడనిపించుకున్న నేత ఆయన. ప్రత్యేకించి నెల్లూరు జడ్పీ ఛైర్మన్‌గా ఆయన హయాంలో జిల్లాలో వేలాది పాఠశాలలు ప్రారంభమై, వేల మందికి ఉద్యోగావకాశాలు కూడా లభించాయి. అంతేకాదు, నెల్లూరు జడ్పీ పేరును చరిత్రలో శాశ్వతం చేస్తూ 'విక్రమసింహపురీ మండల సర్వస్వము' అనే పేరుతో జిల్లా చరిత్రను, జడ్పీ ద్వారా అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అపూర్వమైన రీతిలో గ్రంథస్తం చేయించిన అరుదైన ఘనత కూడా చంద్రశేఖరయ్యదే. ఈ నేపథ్యంలో ఆయన సేవలకు గుర్తింపుగా జడ్పీ భవనానికి నల్లపరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పేరు పెట్టాలని తీర్మానించడం పట్ల జిల్లాప్రజల్లోనూ సంతోషం వ్యక్తమవుతోంది. ఇది మంచి నిర్ణయమని, ఈ తీర్మానాన్ని రాష్ట్ర ప్రభుత్వ అనుమతి కోసం పంపుతున్నామని మంత్రి కాకాణి ఈ సమావేశంలో ప్రకటించారు.

# కంచుకోటలో వలసల బాట!

(మొదటి పేజీ తరువాయి)

అదురుదెబ్బ తగిలినట్లుగా అయ్యింది. మరోవైపు ఉదయగిరి శాసనసభ్యుడు మేకపాటి చంద్రశేఖరరెడ్డి కూడా స్వరం పెంచారు. తమ నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త కొడవలూరు ధనుంజయ రెడ్డిపై ధ్వజమెత్తారు.

జగన్‌మోహన్‌రెడ్డి సొంత పార్టీ పెట్టినప్పటినుండీ, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి పట్టుకొమ్మగా ఉన్న నెల్లూరుజిల్లాలో ఉన్నట్లుండి జరుగుతున్న పరిణామాలు, పార్టీ నాయకులను, కార్యకర్తలను ఆందోళనకి గురిచేస్తున్నాయి. వైసీపీ ఏర్పడిన తరువాత తొలి సారిగా 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో జగన్‌మోహన్ రెడ్డి పార్టీ 67 సీట్లలో విజయం సాధిస్తే వాటిలో 7 సీట్లు ఒక్క నెల్లూరుజిల్లా నుండే లభించాయి. అంటే గెలిచిన 67లో 10శాతం సీట్లు నెల్లూరు జిల్లాలో ఉన్నాయి. 2019లో జిల్లాలోని 10కి 10 వైసీపీనే కైవసం చేసుకుంది. వైసీపీకి నెల్లూరు కంచుకోట అన్న స్థాయిలో ఇమేజ్ కలిగిన జిల్లాలో... ఇప్పుడు పార్టీ డామేజ్ అవుతుందన్న ఆవేదన పార్టీ శ్రేణులలో కనిపిస్తోంది.

## ఏడాదిన్నర ముందే నిష్క్రమించిన కోటంరెడ్డి..!

కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పార్టీని వీడడం ఇప్పుడు జిల్లా రాజకీయ వర్గాలలో పెద్ద చర్చనీయాంశం అయ్యింది. ఒకవైపు శ్రీధర్‌రెడ్డి పార్టీ వీడే దిశగా శరవేగంగా అడుగులు వేస్తున్న తరుణంలో... మరోవైపు 'ఇది టీ కప్పులో తుఫానే' అని మంత్రి కాకాణి కొట్టిపారేసేంతగా, ఆయన పార్టీ వీడే ప్రసక్తే లేదన్నంత గట్టి నమ్మకాన్ని పార్టీ వర్గాలలో కల్పించిన కోటంరెడ్డి ఉన్నట్లుండి బాంబు పేల్చాడు. "ప్రస్తుతానికి పార్టీ వీడుతున్నాను, భవిష్యత్ కార్యాచరణ మళ్ళీ ప్రకటిస్తాను" అని చెప్పకుండా, రాబోయే ఎన్నికలలో తాను తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా రూరల్ నుండి బరిలో దిగబోతున్నానని చెప్పి ఇటు వైసీపీ అటు టీడీపీ పార్టీ నేతలందరికీ షాక్ ఇచ్చారు. "తన ఫోన్లు 3 నెలలుగా ట్యాపింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వమే తన ఫోన్లపై నిఘా ఉంచిందని" ఏకంగా ముఖ్యమంత్రిపైనే ఆరోపణలు చేసి పార్టీ నుండి బయటకి వెళ్లిపోయారు. తన ఫోన్ ట్యాపింగ్ విషయం కేంద్రహోం శాఖ దృష్టికి తీసుకువెళ్లి , ఫిర్యాదు చేస్తానని కూడా చెప్పారు. ఎన్నికలకు ఇంకా చాలా సమయం ఉంది. ఇలాంటి సమయంలో శ్రీధర్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. వైకాపాకి కంచుకోట లాంటి జిల్లాలో వరుసగా నేతలు వలసబాట పట్టడం రాజకీయవర్గాలలో చర్చనీయాంశమైంది. ట్యాపింగ్ జరగలేదని, తొందరపడవద్దని, నిజానిజాలు తేలుస్తామని నెల్లూరు జిల్లా పార్టీ పెద్దలు, జిల్లా పార్టీ సమన్వయకర్తలు సముదాయించినా శ్రీధర్‌రెడ్డి వినలేదు. వెళ్లిపోవడానికి నిర్ణయించుకున్నానని ఖరాకండిగా చెప్పేశారు. 'పార్టీ అధికారంలో ఉంది, ఇప్పుడు బయటకు వెళ్లి ఎందుకు ఇబ్బందులు పడతావు' అని జిల్లా నేత ఒకరు సర్దిచెప్పినా శ్రీధర్ ససేమిరా అన్నారని సమాచారం. అన్నిటికీ సిద్ధపడే తాను బయటకు వెళ్తున్నానని చెప్పినట్లు కూడా వార్త.

శ్రీధర్‌రెడ్డి ఉదంతం జరుగుతున్న తరుణంలోనే ఆనం రామనారాయణరెడ్డి మరోసారి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. తన ఫోన్లు కూడా ట్యాపింగ్ చేస్తున్నారని చెప్పారు. ఆయన ఒకడుగు ముందుకువేసి తనకు భద్రత తగ్గించి, ప్రభుత్వం తనను చంపించాలని చూస్తోందని తీవ్రస్థాయిలో ఆరోపించారు. అదే సమయంలోనే ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి కూడా మీడియా ముందుకు వచ్చారు. తమ నియోజకవర్గ సమన్వయకర్త పైనా, ప్రభుత్వ పెద్దలపైనా తనకున్న అసంతృప్తినంతా వెళ్లగక్కారు.

వైసీపీకి బలమైన జిల్లాగా పేరున్న నెల్లూరుజిల్లాలో ఇలాంటి సంఘటనలు జరగడం ఇప్పుడు రాజకీయ విశ్లేషకులను ఆలోచింప జేస్తోంది. ఆనం, కోటంరెడ్డి, మేకపాటి బాటలో మరికొంత మంది జిల్లా నాయకులూ ఉన్నారన్న పుకార్లు కూడా జోరుగా షికారు చేస్తున్నాయి.

## రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఆదాల ప్రభాకరరెడ్డి!

జగన్‌మోహన్‌రెడ్డి తీసుకునే నిర్ణయాలు కఠినంగా ఉంటాయి. ఆయన బెదిరింపులకు లొంగరు. ఎవరినీ బతిమాలరు. బుజ్జగింపు ఆయన నైజం కాదు. శ్రీధర్‌రెడ్డి వ్యవహారంలో కూడా ఆయన ఆలస్యం చేయలేదు. ఫిబ్రవరి 2వ తేదీ, గురువారం సాయంత్రం 26 జిల్లాల పార్టీ సమన్వయకర్తలతో సమావేశమయ్యారు. నెల్లూరుజిల్లాపై ప్రత్యేక దృష్టి పెట్టారు. జిల్లా పార్టీ సమన్వయకర్త బాలినేని శ్రీనివాసరెడ్డి సమక్షంలో, రూరల్ నియోజకవర్గానికి సంబంధించి ఇన్‌ఛార్జిగా పార్లమెంటు సభ్యులు, సీనియర్ నాయకుడు ఆదాల ప్రభాకరరెడ్డిని నియమించారు. శ్రీధర్‌రెడ్డి వ్యవహారశైలిపై జగన్ కోపోద్రిక్తుడైనట్లు సమాచారం. పార్టీకి వ్యతిరేకంగా ఎవరు ప్రవర్తించినా కఠినంగా చర్య తీసుకోవలసిందిగా బాలినేనిని ఆదేశించారని తాడేపల్లి వార్త. ఆదాలకి రూరల్ పగ్గాలు అప్పజెప్పడంపై పార్టీ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఆదాల కూడా పార్టీని వీడిపోనున్నారన్న అపోహలను, అపవాదును తొలగిస్తూ... తమ నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి సరైన సమయంలో సముచిత నిర్ణయం తీసుకున్నారని సంబరపడుతున్నారు.

ఏదిఏమైనా పార్టీకి కంచుకోట లాంటి నెల్లూరులో వలసలు ప్రారంభం కావడం పార్టీకి ఒక మేలుకొలుపు లాంటిదని విశ్లేషకులు అంటున్నారు. రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలపై కూడా దృష్టి పెట్టి, ముందస్తుజాగ్రత్తగా చర్యలు చేపట్టి, పార్టీలో ఉన్న చిన్న చిన్న అసంతృప్తులను సర్దిపుచ్చడానికి ఈ సంఘటనలు ఉపయోగపడతాయని అభిప్రాయపడుతున్నారు.

# రవి సన్నారెడ్డికి.. సీఎం జగన్ ప్రశంస



జనవరి 31వ తేదీ కొత్త ఢిల్లీలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సన్నాహక సదస్సులో పాల్గొన్న శ్రీసిటి వ్యవస్థాపక స్ఫూర్తిప్రదాత, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవి సన్నారెడ్డిని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారు. వేలాదిమందికి ఉపాధి కల్పించే క్రమంలో వందలాది పరిశ్రమలను శ్రీసిటి వేదికగా ఆంధ్రప్రదేశ్‌కు తీసుకురావడంలో కీలకపాత్ర పోషిస్తున్న రవీంద్ర సన్నారెడ్డిని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రశంసించారు.



## కామాక్షమ్మ సేవలో ముప్పా చంద్రశేఖర్, ఐపిఎస్

బెంగుళూరు నగరం, తూర్పు విభాగం అడిషనల్ కమిషనర్, మన నెల్లూరీయుడు ముప్పా చంద్రశేఖర్, ఐపిఎస్.. తమ తల్లి దుర్గాభవానితో కలిసి జనవరి 31న జొన్నవాడ కామాక్షమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మెన్ సుబ్రహ్మణ్యం నాయుడు ఆయనను స్వాగతించి సత్కరించారు.

# జ్ఞానదీపికలు.. మన ఉపనిషత్తులు

- ఆకట్టుకున్న ఆధ్యాత్మిక ప్రవచనాలు



పద్య సారస్వత పరిషత్ నెల్లూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా ఫిబ్రవరి 23 నుంచి 31వ తేది వరకు జరిగిన ఉపనిషత్ ప్రవచనోత్సవాలు ఆద్యంతం అందరినీ ఆకట్టుకున్నాయి. ఎంతో ప్రాచీనమైన మన ఉపనిషత్తులు, వాటిల్లో ఉన్న అనేక అసక్తికరమైన అంశాలను, నాటి మహర్షుల అద్వితీయమైన బోధనలను, ఉపనిషత్తుల గొప్పదనాన్ని ఈ సందర్భంగా ఉపన్యాసకులు అందరికీ అర్థమయ్యేరీతిలో వెల్లడించారు. నెల్లూరు బాలాజీ నగర్‌లోని శ్రీ సీతారామస్వామి మందిరంలో ఈ ప్రవచనాలు ఇనమడుగు శ్రీ సత్యానందాశ్రమ పీఠాధిపతులు శ్రీ శ్రీహరితీర్థస్వాముల అనుగ్రహభాషణంతో ప్రారంభమయ్యాయి. సకల జ్ఞానాలకీ జ్ఞానమై, సకల ధర్మాలకే ధర్మమై సర్వత్రా వ్యాపించివున్న ఆత్మ తత్వాన్ని, ఆ పరమాత్మ స్వరూపాన్ని కళ్లకుకట్టినట్లుగా బోధించేవే ఉపనిషత్తులని, అక్షయమైన ఆ జ్ఞానాన్ని.. అక్షరమైన ఆ పరబ్రహ్మ తత్వాన్ని తెలుసుకొని మసలుకునేందుకు ఉపనిషత్తులు వెలుగుబాటలు చూపుతాయని ఉపన్యాసకులు పేర్కొన్నారు. ధర్మబద్ధమైన జీవితాలతో.. ఆ దివ్యమార్గాల్లో పయనించడం ద్వారా మానవజీవితం ధన్యమవుతుందని వారు సూచించారు. ఈ ఉపనిషత్తుల్లో.. కఠోపనిషత్తు గురించి అవధాని కోట రాజశేఖర్, ప్రశ్నోపనిషత్తు సారాంశాన్ని డాక్టర్ సింగరాజు రామకృష్ణప్రసాదరావు, ఈశావ్యాసోపనిషత్తులోని అంశాలను విద్వాన్ అగస్త్యరాజు సుబ్బారావు, మాండూక్యోపనిషత్తును పోలవరపు లక్ష్మీనరసింహారావు, ముండకోపనిషత్తు గురించి విద్వాన్ డా.చీమకుర్తి వెంకటేశ్వరరావు వివరించారు. తైత్తిరీయోపనిషత్తులోని శిక్షావల్లి, ఆనందవల్లి, భృగువల్లిల గురించి మూడురోజుల పాటు వరుసగా విద్వాన్ సూరం చంద్రశేఖరం, శతావధాని డా.సూరం శ్రీనివాసులు, సూరం అరుణలు తమ ప్రవచనాల్లో చక్కగా వివరించారు. మందిరం నిర్వాహకులు అమర్తలూరు వెంకటేశ్వర్లు గుప్తా, పద్యకళాపరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్, ప్రపంచ తెలుగుసమాఖ్య రీజనల్ కన్వీనర్ నలుబోలు బలరామయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.


## ఉత్తరక్రియలు



పూజ్యులు, మా ఇంటి దైవం, మా అభివృద్ధికి కారకులు

**కీ॥శే॥ ఇందుపూరు సునంద గారు**

తేది. 28-01-2023 శనివారం పరమపదించినారు.

వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

భర్త : ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి

కుమారులు : ఇందుపూరు అచ్యుతశంకర్‌రెడ్డి

ఇందుపూరు ఉదయ్‌శంకర్‌రెడ్డి

పొట్టేపాళెం

మరియు కుటుంబసభ్యులు

పెద్దకర్మ : తేది: 09.02.2023 గురువారం పొట్టేపాళెంలోని మా స్వగృహమునందు జరుగును. కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

లాయర్
ఫిబ్రవరి 03, 2023

# విశ్వవిజేతలు.. భారతీయ అమ్మాయిలు

భారత క్రికెట్ ప్రస్థానంలో ఇది మరో అద్భుతమైన అధ్యాయం. దక్షిణాఫ్రికాలో ఇటీవల జరిగిన మహిళల తొలి అండర్-19 వరల్డ్‌కప్ క్రికెట్ టోర్నీలో భారతీయ బాలికలు ఇంగ్లండ్ జట్టును మట్టికరిపించడం అసాధారణమైన విజయం. మన భారతీయ అమ్మాయిలు ప్రపంచవిజేతలుగా నిలవడం చరిత్రాత్మకం. మగవాళ్లే కాదు.. ఆడవాళ్ళు కూడా అద్భుతంగా క్రికెట్ ఆడగలరన్న పరమసత్యాన్ని కళ్ళముందుంచారు మన భారతీయ అమ్మాయిలు. ప్రపంచ క్రికెట్‌లో చెలరేగిపోయారు. సెమీఫైనల్స్‌లో న్యూజిలాండ్ జట్టును ఓడగొట్టి, ఫైనల్స్‌లో ఇంగ్లండ్ జట్టునూ మట్టికరిపించి ప్రపంచ ప్రజల కరతాళధ్వనులందుకున్నారు. మహిళా క్రికెట్‌లో భారత్ విశ్వవిజేత కావడం భారతీయ మహిళా క్రికెట్‌లో ఒక సువర్ణాధ్యాయమే. అండర్-19 విభాగంలో దక్షిణాఫ్రికా గడ్డమీద ఇటీవల జరిగిన ప్రపంచ కప్ పోటీల్లో మెరుపులు మెరిపించారు. అమ్మాయిలు కాదు.. చిచ్చరపిడుగులే అనిపించారు. క్రికెట్ అంటే మా ఆట. మేం సృష్టించామంటూ క్రికెట్‌కు పుట్టినిల్లుగా చెప్పుకునే ఇంగ్లండ్ జట్టునే ఓడించి ఇంటికి పంపించారు. ఆరంభ టోర్నీలోనే భారత్ జట్టు అద్భుతంగా ఆడుతూ, ఫైనల్‌మ్యాచ్‌లో ఇంగ్లండ్‌ను చిత్తుచేసింది. 7 వికెట్ల తేడాతో భారత్ మహిళా క్రికెటర్లు ఘనవిజయం సాధించారు. ఐసిసి తొలిసారిగా నిర్వహించిన ఈ క్రికెట్ పోటీల్లో విజయం సాధించి, సరికొత్త అధ్యాయాన్ని సృష్టిస్తూ ప్రతిష్ఠాత్మకమైన ప్రపంచకప్ ట్రోఫీని గెలుచుకోవడం శుభపరిణామం. బ్యాటింగ్‌లో తెలుగింటి అమ్మాయి గొంగడి త్రిష అద్భుతంగా రాణించి అందరి ప్రశంసలందుకుంది. 24 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచింది. తొలుత, భారత కెప్టెన్ షఫాలీ టాస్ గెలిచి బౌలింగ్‌కు సిద్ధం కావడం, తొలి ఓవర్‌లో నాల్గవ బంతికే టిటాస్ సాధు వికెట్ తీయడం సంచలనమైంది. ఇంగ్లండ్ 10 ఓవర్లు ముగిసేసరికే 39 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. 17.1 ఓవర్లలో 68 పరుగులకే ఇంగ్లండ్ జట్టు పరాజయం పాలైంది. భారత్ బౌలర్లు టిటాస్ సాధు, అర్చనాదేవి, పర్షవి చోప్రా, మన్నత్ కశ్యప్, షఫాలీవర్మ, సోనమ్‌యాదవ్‌లు బాగా రాణించారు. త్రిష, సౌమ్య తివారీ కలిసి చేసిన పరుగులతో విజయం చేరువలోకి వచ్చింది. వారిద్దరూ క్రికెట్‌లో 'పరుగుల' రాణులనిపించుకున్నారు. బ్యాటింగ్‌లోనే కాదు.. బౌలింగ్, ఫీల్డింగ్‌లలో కూడా మన భారతీయ అమ్మాయిలు అదరహో అనిపించారు. సౌమ్య తివారీ పరుగులతో భారత్‌జట్టు విజయ తీరానికి చేరింది. మ్యాచ్ గెలవడంలో మన తెలుగమ్మాయి త్రిష ఆటే కీలకంగా ఉండడం విశేషం. షఫాలీ వర్మ కెప్టెన్‌గా బరిలోకి దిగిన భారతీయ జట్టు సునాయాసంగా ఇంగ్లండ్ జట్టును ఓడించి, ప్రపంచకప్‌ను సాధించడం పెద్దసంగతి.

మనదేశంలో ఆడపిల్లలకు ప్రత్యేక క్రికెట్ అకాడమీలు కూడా ఏర్పాటవుతున్న నేటి రోజుల్లో ఈ తాజా విజయం మహిళా క్రీడాకారులకు మరింత ఉత్సాహాన్ని, ప్రోత్సాహాన్ని అందిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. అయినా మనదేశంలో అమ్మాయిలు బయట కాలు పెట్టాలంటేనే ఎన్నో ఆంక్షలు, ఇంటా బయటా లెక్కలేనన్ని అభ్యంతరాలు. రోజులు మారుతున్నా సమాజంలో మనవాళ్ళ తీరుమాత్రం మారడమే లేదు. మహిళలకు నేటికీ ఆశించిన స్థాయిలో స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు రానే రావడం లేదు. ఇలా ఇంటింటా నిబంధనల బంధనాలెన్నో ఉన్నప్పటికీ అన్ని కష్టాలను అధిగమించి మహిళలు ముందంజ వేస్తుండడం సంతోషకరం. విజేతలైన మన క్రీడాకారిణుల వెనుక వారి తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో బావుందనడానికి కూడా ఇదొక నిదర్శనం. తల్లిదండ్రులు, గురువులు, చుట్టూ ఉన్నవారు అందరూ సహకరించి శెభాష్ అనాలేగానీ, మన అమ్మాయిలు సాధించలేనిదేముంటుంది! మహిళల క్రికెట్‌లో దిగ్విజయాన్ని సాధించి ప్రపంచస్థాయిలో మహిళా క్రికెట్‌నే ఆకాశమంత ఎత్తు నిలపడంలో భారతీయ అమ్మాయిల పాత్ర చరిత్రాత్మకమైందనే చెప్పవచ్చు. అందుకే బిసిసిఐ మన భారతీయ జట్టుకు 5 కోట్ల రూపాయల భారీ నజరానా కూడా ప్రకటించి అభినందించింది.

భారత మహిళా క్రికెట్ భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉండాలని, రానున్న అంతర్జాతీయస్థాయి పోటీల్లోనూ మరిన్ని ఘనమైన విజయాలను సాధించాలని ఆశిద్దాం!.. మూడుసార్లు అందినట్లే అంది చివరికి అందకుండానేపోయిన ప్రపంచకప్‌ను సాధించి, భారత్‌ను విశ్వవిజేతగా నిలిపినందుకు భారత జట్టుకు అభినందనలు!.. తద్వారా మహిళాలోకానికే కాక.. దేశానికే ఘన కీర్తితెచ్చిన మన క్రీడాకారిణులందరికీ శుభాభినందనలు!

# ప్రచార ఆర్భాటం కోసమే ఈ యువదళం పాదయాత్రలు!

గత వారం మన 'లాయర్'లో యువదళం పాదయాత్రలపైన రాసిన విశ్లేషణ బాగుంది. అయితే మహాత్మాగాంధీ, వినోభాభావే, రాజశేఖరరెడ్డిల పాదయాత్రలతో మిగిలిన వాటిని పోల్చలేం. పాతతరం నాయకులు చేసిన పాదయాత్రలు అర్థవంతమైనవి, సందేశాత్మకమైనవి, ప్రయోజనకరమైనవి. అలాగే, వైయస్సార్ చేసిన పాదయాత్రలో కూడా నిజాయతీ ఉంది. ప్రజా సమస్యలు తీర్చడంపట్ల ఆయనకున్న నిబద్ధతని ఆయన పరిపాలనలో కూడా చూపించారు. విశ్వసనీయత అన్న పదానికి అర్థం చెప్పిన నిఖార్సైన నాయకుడు రాజశేఖరరెడ్డి. ఆ తరువాత చంద్రబాబు, జగన్ మోహన్‌రెడ్డి, షర్మిల, రాహుల్ గాంధీ... ఇప్పుడు లోకేష్ చేసిన, చేస్తున్న పాదయాత్రలకు నిబద్ధత లేదు. కేవలం ప్రచార ఆర్భాటంతో అధికారంలోకి రావడమే వీళ్ళ పాదయాత్రల లక్ష్యం తప్ప, నిజంగా వీళ్ళు ప్రత్యక్షంగా చూసే ప్రజా సమస్యలను పరిష్కరించే నైజం వీరిది కాదు. ఈ తరం నేతలు ఎవరు పాదయాత్రలు చేసినా.. అవి కేవలం అధికారమే ఆరాటంగా ప్రచారం కోసం ఆర్భాటమే తప్ప, నిజమైన ప్రజాసంక్షేమ యాత్రలు కానేకావు.




**ఎం. లక్ష్మీనారాయణ - శ్రీకాళహస్తి.**

# ఒళ్ళు హూనమవుతోంది..!

నెల్లూరు నగరంలోని ముత్తుకూరు గేట్(రామలింగాపురం) కూడలి వద్ద వాహనదారుల ఒళ్ళు హూనమవుతోంది. ఈ జంక్షన్లో నానాటికీ పెరుగుతున్న ట్రాఫిక్‌ని దృష్టిలో పెట్టుకుని ఇక్కడ వంతెన నిర్మిస్తున్నారు. ఆలోచన బాగానే ఉంది. ఆచరణలోనే లోపాలున్నాయి. ఈ వంతెన నిర్మాణానికి కాల పరిమితి కూడా నిర్ణయించారు, కానీ అది కాలగర్భంలో కలిసిపోయింది. నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందో అంచనాలు లేవు. కనీసం నిర్మాణానికి ఇరువైపులా ఉన్న డైవర్షన్ రోడ్డునన్నా బాగుచేసి కాంట్రాక్టర్లు పుణ్యం కట్టుకోవాలి. ముఖ్యంగా రామ్మూర్తినగర్ నుండి మాగుంట లే-అవుట్ వైపు వచ్చే మార్గం నరకప్రాయంగా తయారయ్యింది. గుంతల మయంగా మారిన ఈ కొద్ది దూరం ప్రయాణించాలంటే చుక్కలు కనిపిస్తున్నాయి. ఈ కూడలి దాటేలోగా ఒళ్ళు, బళ్ళు(వాహనాలు) రెండూ గుల్లవుతున్నాయి. రోడ్డు బాగాలేక వాహనాలు స్లో అవుతుండడంతో ఈ కూడలిలో ట్రాఫిక్ కూడా బాగా జామ్ అవుతోంది.

**ఆర్. గంగాధర్‌రెడ్డి - జగదీష్‌నగర్.**

# సర్వసంగపరిత్యాగులకు 'పద్మ' అవార్డులు అవసరమా?

తాజాగా కేంద్ర ప్రభుత్వం చినజీయర్ స్వామికి పద్మభూషణ్ అవార్డు ప్రకటించడం ఆశ్చర్యం కలిగించింది. తమను తాము దైవాంశ సంభూతులుగా, భగవంతుని ప్రతినిధులుగా, సర్వసంగ పరిత్యాగులుగా చెప్పుకునే వారికి ఇలాంటి పురస్కారాలు అవసరమా? హిందుత్వ పార్టీగా ముద్ర వేసుకున్న భాజపా కూడా తమ రాజకీయ ప్రయోజనాలకోసం మఠాలను, మఠాధిపతులను వాడుకోవడం సబబు కాదు. తనకి ప్రభుత్వం ప్రకటించిన 'పద్మ' అవార్డును జీయర్ స్వామి తిరస్కరించాలి, అప్పుడే ఆయనకి, ఆయన సేవలకు, ఆయనను ఆరాధించే ఆయన భక్తబృందానికీ గౌరవం. ఆధ్యాత్మిక బోధనలతో సమాజ శ్రేయస్సుకోసం తపించే తమ లాంటివారికి ఈ పద్మ అవార్డు తృణప్రాయం అనేలా జీయర్‌వారు స్పందించాలి. అశేష స్వామివారి భక్తుల పక్షాన ఇది నా మనవి.

**రామసుబ్రహ్మణ్యం కొలకల - ఆత్మకూరు.**

# 'చదువు'కు.. చెదలు!



అందరూ చదువుకోవాలని, పుస్తకాలు చదువుకోవడం ద్వారా ప్రజలు మంచి జ్ఞానాన్ని సంపాదించుకుని సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షిస్తూ నూరేళ్ళ క్రితమే ఎందరో మహానుభావులు గ్రంథాలయాలకు బాటలు వేశారు. సమాజ సంస్కర్త, గ్రంథాలయోద్యమ పితామహులు అయ్యంకి వెంకటరమణయ్య. 'ప్రజా గ్రంథాలయాలే ప్రజల విశ్వవిద్యాలయాలు' అంటూ ఎన్నో గ్రంథాలయాలు నెలకొల్పి, వాటిని సరస్వతీ నిలయాలుగా తీర్చిదిద్దారు. చదువుల తల్లికి గుడి కట్టారు. మరోవైపు ప్రముఖ పాత్రికేయుడు.. స్వాతంత్ర్యసమరయోధుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు వంటివారంతా గ్రంథాలయోద్యమాన్ని ఎంతో దీక్షగా ముందుకు నడిపారు. 1919లో నవంబరు 14న మద్రాసులో తొలి అఖిలభారత పౌరగ్రంథాలయాన్ని స్థాపించి సభ నిర్వహించడం గ్రంథాలయోద్యమంలో పెద్దమలుపు. ఆ రోజును పురస్కరించుకుని నేటికీ దేశంలో 'జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు' జరుగుతున్నాయి. దేశంలోనే తొలిసారిగా అఖిలభారత పౌరగ్రంథాలయాన్ని స్థాపించిన ఘనత కూడా అయ్యంకి వారిదే. నాటి బ్రిటిష్‌పాలనలో అన్ని కష్టనష్టాలకు ఎదురొడ్డి గ్రంథాలయాలను ప్రజలకు చేరువచేసిన మహనీయులు వారు. దాంతో స్వాతంత్ర్యోద్యమకాలంలో గ్రంథాలయోద్యమం కూడా బాగా ఊపందుకుంది. అప్పట్లో పుస్తకాలు అధికశాతం ప్రజలకు అందుబాటులో లేక, పత్రికలు చదవడం అందరికీ రాక అవస్థలు పడేవారు. మన జిల్లాలోనూ అదే పరిస్థితి. సామాన్య ప్రజలకు చదువు అందుబాటులో లేకపోవడం, చదువుకోవడానికి తగ్గ పుస్తకాలు లేకపోవడం ఒక పెద్ద కొరతగా ఉండేది. ఏ పెద్ద బాలశిక్షో, ఎక్కాల పుస్తకమో చేతిలో ఉంటే చాలు..అదే పెద్ద గొప్ప. డబ్బున్నవారు

## సమస్యల తో 'రణం'

గ్రంథాలయాలకు పత్రికలు కొని తెప్పించి అక్షరసేవ చేసేవారు. ఊరూరా గ్రంథాలయం ఉండాలని పెద్దలంతా సంకల్పించి ఎవరికి తోచినవిధంగా వాళ్ళు కృషిచేసేవారు. ఫలితంగా మన జిల్లాలోనూ అనేక గ్రంథాలయాలు ఏర్పడ్డాయి. ఇంతటి ఘనచరిత్ర ఉన్న మన గ్రంథాలయాలు ఇప్పుడు నిరాదరణకు గురవుతూనే ఉన్నాయి.

### నాడు ఘనం.. నేడు దయనీయం!..

నేడు నిధులు లేక నీరసపడి, వసతులు లేక చతికిలపడిన గ్రంథాలయాలొకవైపు, స్మార్ట్‌ఫోన్‌ల మాయాజాలంలో పడి విజ్ఞానభాండాగారాలైన గ్రంథాలయాలవైపు చూడని యువ పాఠకులొకవైపు.. కలిసి వెరసి 'చదువుకు చెదలు' పట్టిపోతున్నాయి. పేద విద్యార్థులకు, సామాన్య పాఠకులకు ఎంతగానో ఉపయోగపడే పాఠ్యపుస్తకాలు, విజ్ఞానదాయకమైన ఎన్నోరకాల పుస్తకాలు గ్రంథాలయాల్లో ఉంటాయి కనుక, వాటిని చదువుకునేందుకు వారు నిత్యం గ్రంథాలయాలకు వస్తూనే ఉంటారు. వారికోసమైనా ఈ విజ్ఞానదీపులు మలిగిపోకుండా కాపాడుకోవాలి. ఎంతో అపురూపమైన పుస్తకాలకు కనీసం బైండింగ్ చేసి భద్రపరచుకోలేని దుస్థితి నుంచి గ్రంథాలయాలను కాపాడుకోవాలి. ప్రజలు కట్టే పన్నుల నుంచి అత్యల్పశాతం పన్ను (సెస్సు) గ్రంథాలయాలకు ఇవ్వండని ప్రభుత్వం కేటాయించినా, ఆ పన్నును వసూలుచేసుకుంటున్న పంచాయతీలు, స్థానిక సంస్థలు మాత్రం గ్రంథాలయాలకు ఆ డబ్బులు ఇవ్వకపోవడంతో గ్రంథాలయాల వ్యవస్థ ఎంతోకాలంగా అష్టకష్టాల్లోనే ఉందన్నది అందరికీ తెలిసిందే. పాలకులు, అధికారులందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే. నిధులు లేకుండా అభివృద్ధి ఎలా సాధ్యం?..ఒక్క నెల్లూరు నగరపాలక సంస్థే అక్షరాలా ఇరవైఏడు కోట్ల రూపాయలకు పైగానే జిల్లా గ్రంథాలయ సంస్థకు సెస్సు బకాయి ఉంది. దాదాపు పదిహేనేళ్ళుగా బకాయిలు పెరిగిపోతున్నా గ్రంథాలయసంస్థకు సెస్సు చెల్లించకపోతే.. ఇక గ్రంథాలయాలకు దిక్కేదీ?..గ్రంథాలయాల నిర్వహణకు, జీతాలకు వగైరాలకు ఎంత కష్టం?...అయినా, జిల్లా ఉన్నతాధికారులు కానీ, ప్రభుత్వం కానీ పట్టించుకోకపోవడం ఎంత దారుణం?.. జిల్లాలో గ్రంథాలయసంస్థ ఆధ్వర్యంలో సుమారు 60 దాకా శాఖాగ్రంథాలయాలున్నాయి. అనేకం ఇంకా అద్దెభవనాల్లోనే బిక్కుబిక్కుమంటున్నాయి. ఏళ్ళతరబడిగా ఈ దుస్థితిలో ఎలాంటి మార్పు పలేదు. అంతెందుకు..నెల్లూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయం భవనమే శిథిలమైతే..కొత్తది కడతామన్నారు.. ఎంత కాలమని?... ఇప్పటికీ అదింకా బాలారిష్టాల్లోనే ఉంది. ఇక శాఖా గ్రంథాలయాల దుస్థితి చెప్పాల్నా!..గ్రంథాలయాలకు అవసరమైన ఫర్నిచర్ కానీ, పాఠకులకు వసతులు కానీ ఉండడంలేదు. ముఖ్యంగా సిబ్బంది కొరత తీవ్రంగాఉంది. ఎంత దయనీయం?.. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే గ్రంథాలయాలకు కొత్తపుస్తకాల కొనుగోలుకు నిధులిచ్చి, గ్రంథాలయాల బాగుకు కొంత సహకారం అందిస్తుండడం కొంతలో కొంత మేలే. అయితే, అది ఏమూలకు?..ఇంకా చేయాల్సింది ఎంతో ఉంది. కంప్యూటర్లు పంపారు.. బాగానే ఉంది. వాటిని ఆపరేట్ చేసేవారేరీ?.ఆమేరకు ఇప్పుడున్నవారికైనా శిక్షణ ఇచ్చేదెప్పుడు?..కంప్యూటర్ పరిజ్ఞానంఉన్న సిబ్బందిని నియమించడం కూడా అవసరమే. పుస్తకాలు వేలు, లక్షల సంఖ్యలో ఉన్నాయి. వాటిని భద్రం చేసుకునేందుకు చాలినన్ని బీరువాలు కానీ, అరమరలు కానీ లేవు. పుస్తకాలు చిరిగిపోకుండా బైండింగ్ చేసేందుకు గతంలో గ్రంథాలయ సంస్థల్లో బైండర్‌లు ఉండేవారు. ఇప్పుడా పోస్టులే లేవు. గ్రంథాలయాల్లో ఎంతో అపురూపమైన గ్రంథాలుంటాయి. అవి కాలక్రమేణా చిరిగిపోవడమో, చెదలు పట్టడమో జరుగుతుంటే.. ఇక ఆ గ్రంథాలయాల్లో సరస్వతీదేవి ఎందుకుంటుంది?..బాగా చదువుకునేవాళ్ళని 'పుస్తకాల పురుగులని' కూడా అంటుంటాం. కానీ, 'పుస్తకాలకి పురుగులు' పడుతున్నాయిప్పుడు?..దయచేసి తేడా గమనించండి. జిల్లా అధికారులు, ప్రభుత్వం ఇకనైనా ఈ సమస్యలపై దృష్టి పెట్టి వాటిని బాగుచేయాలని నా మనవి, ప్రార్థన..విన్నపం!...

**- సంచారి**



# మదనపల్లిలో..పర్వతరెడ్డి పర్యటన

తూర్పు రాయలసీమ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఇటీవల చిత్తూరు జిల్లాలోని మదనపల్లి, కురబలకోట ప్రాంతాలలోని పలు ప్రభుత్వ పాఠశాలలలో గుంటూరు ఎమ్మెల్సీ కల్పలతారెడ్డితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పర్వతరెడ్డికి సాదరస్వాగతం పలికి తమ మద్దతు ప్రకటించారు. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటికే తాము అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామని, భవిష్యత్తులో ఎమ్మెల్సీగా విజయం సాధిస్తే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడం జరిగిందని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు.

# ముంగమూరు ఆదర్శప్రాయుడు

## వర్ధంతి కార్యక్రమంలో అబ్దుల్ అజీజ్



జిల్లా రాజకీయాల్లో మాజీ ఎమ్మెల్యే, దివంగత నాయకుడు ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డి ఆదర్శప్రాయులని, ఎవరినీ ద్వేషించని మంచి నైజం ఆయనదని, అజాతశత్రువని టిడిపి నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ అన్నారు. జనవరి 31న ముంగమూరు ప్రథమ వర్ధంతి సందర్భంగా నెల్లూరులోని టిడిపి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అజీజ్ తదితర నాయకులు పాల్గొని ముంగమూరు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాలాజీనగర్‌లో జరిగిన వర్ధంతి కార్యక్రమంలోనూ పాల్గొన్నారు. ఆయన వెంట టిడిపి నాయకులు చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, జెన్ని రమణయ్య, బ్రహ్మంగుప్త, కప్పిర శ్రీనివాసులు, దర్శి హరికృష్ణ, తిరుమలనాయుడు, అమృల్లా, రేవతి తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా పాలనలో..

# పెరుగుతున్న అరాచకాలు

## బిజెపి నాయకుడు గుండ్లపల్లి ధ్వజం



వైకాపా పాలనలో రాష్ట్రంలో అరాచకాలు ప్రబలిపోతున్నాయని, ఈ దుర్మార్గపు ప్రభుత్వానికి ప్రజలే గుణపాఠం చెప్తారని బిజెపి నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు గుండ్లపల్లి భరత్‌కుమార్ యాదవ్ ధ్వజమెత్తారు. జనవరి 31న నెల్లూరులోని బిజెపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన పార్టీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. బిజెపిని బలోపేతం చేసి జిల్లాలో పార్టీ బలమైన శక్తిగా ఎదిగేందుకు నాయకులు, కార్యకర్తలందరూ గట్టిగా కృషిచేయాలని ఆయన కోరారు. పార్టీనాయకుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి మాట్లాడుతూ, బిజెపి కావలిలో తలపెట్టిన దళితయాత్రను ప్రభుత్వం అడ్డుకోవడం దారుణమన్నారు. ప్రతిపక్షాల నోరునొక్కేందుకు ప్రభుత్వం ప్రయత్నించడం ఏమిటని ప్రశ్నిస్తూ, వైకాపా ప్రభుత్వ ధోరణిని నిరసిస్తూ ప్రజలు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. బిజెపి రాష్ట్ర సంఘటనా కార్యదర్శి మధుకర్‌జీ, జిల్లా నాయకులు రఘురామిరెడ్డి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేంద్రరెడ్డి, వాకాటి నారాయణరెడ్డి, కందుకూరి సత్యనారాయణ, మిడతల రమేష్, మహిళానాయకురాలు కాకు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు



# ఎన్‌బికెఆర్ ఇన్‌స్టిట్యూట్ విద్యారంగానికే మకుటం

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో రామ్‌కుమార్‌రెడ్డి

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇన్‌స్టిట్యూట్ విద్యారంగానికే మకుటాయమైనదిగా ఉత్తమరీతిలో అలరారుతోందని ఎన్‌బికెఆర్ ఇన్‌స్టిట్యూట్ కరెస్పాండెంట్, రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఛైర్మెన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అభివర్ణించారు. ఇటీవల ఆయన ఎన్‌బికెఆర్ ఇన్‌స్టిట్యూట్‌లో 1992 నుంచి 1996 వరకు, 1991 నుంచి 1995 వరకు ఇంజనీరింగ్ చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులతో కలసి ముచ్చటించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో రామ్‌కుమార్‌రెడ్డి పూర్వ విద్యార్థులకు ఆత్మీయ సందేశాలు అందజేశారు. కళాశాలలో చదివిన ఇంజనీరింగ్ విద్యార్థులు ఎక్కడెక్కడ ఉద్యోగాలు చేస్తున్నదో తెలుసుకుని సంతోషించారు. సమాజంలో ప్రముఖ స్థానాల్లో ఉన్నప్పటికీ సంవత్సరానికి ఒక సారైనా అందరూ కలుసుకొని ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. పూర్వ విద్యార్థులంతా కలవడం మంచి సంప్రదాయమని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి స్నేహితులతో కలిసి కళాశాలలో కలయతిరిగారు. గురువులైన కె.వి రెడ్డి, సాయిరాం, ప్రసాద్, ప్రభాకర్ రావులను సన్మానించారు. అనంతరం అందరూ కలిసి కళాశాల చదువుల నాటి కబుర్లు చెప్పుకుంటూ సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి కిషాంధర్, పలు విభాగాధిపతులు, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు

# గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

## జిల్లా గ్రంథాలయసంస్థ ఛైర్‌పర్సన్ శారద



జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి అన్నివిధాల తగు కృషి చేస్తున్నామని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్ పర్సన్ దొంతు శారద చెప్పారు. జనవరి 30న నెల్లూరులోని స్టోన్‌హౌస్‌పేట రేబాలవారివీధిలో ఉన్న జిల్లా గ్రంథాలయ సంస్థ భవనంలో ఏర్పాటుచేసిన కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. తిరుపతిజిల్లా పరిధిలోని నాయుడుపేట శాఖా గ్రంథాలయానికి సంబంధించిన శిథిలమైన పాతభవనం స్థానంలో స్థానిక దాతల సహకారంతో సుమారు 20 లక్షల రూపాయల వ్యయంతో ఆంధ్రప్రదేశ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారిచే కొత్త భవనం నిర్మించేందుకు గ్రంథాలయ కమిటీ ఆమోదించిందని ఆమె ఈ సందర్భంగా తెలిపారు. గ్రంథాలయ సంస్థకు కొంత మంది దాతలు దాదాపు 20వేలకు పైగానే వివిధ రకాల పుస్తకాలను బహుకరించినందుకు కమిటీ ధన్యవాదాలు తెలియజేసిందన్నారు. వయోజనవిద్య ఉపసంచాలకులు పి.రమేష్, జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ అధికారి ఎం.వెంకటేశ్వరప్రసాద్, ఉప విద్యాధికారి భిక్షాలు, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.కుమార్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

# కూచిపూడి నాట్యగురువు సాంబశివరావుకు.. గౌరవ డాక్టరేట్



నెల్లూరులోని శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి కళాక్షేత్రం అధినేత, ప్రముఖ నాట్యగురువు దేగల సాంబశివరావుకు తమిళనాడులోని హోసూరులో ఉన్న ఆసియా వేదిక్ కల్చరల్ యూనివర్శిటీ వారు జనవరి 28వ తేదీన గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసి ఘనంగా సన్మానించారు. సాంబశివరావు స్వస్థలం కూచిపూడి గ్రామం. కూచిపూడి నాట్యంపై మక్కువతో చిన్నతనంలోనే ప్రసిద్ధ నాట్యగురువు చింతా రామమూర్తి వద్ద నాట్యసాధన ప్రారంభించారు. అనంతరం పదేళ్ళ వయసులో వేదాంత రాధేశ్యాం వద్ద శిష్యరికం చేసి కూచిపూడి నాట్యంలో మెళకువలు నేర్చుకున్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం నుంచి నాట్యంలో సర్టిఫికెట్ కోర్సు, డిప్లొమో కోర్సు, యక్షగానం కోర్సు, సాత్వికాభినయం కోర్సుల్లో ఉత్తీర్ణులై, 2008లో కూచిపూడి నాట్యంలో మాస్టర్ డిగ్రీ కూడా పూర్తిచేసి, ఆ విశ్వవిద్యాలయం నుంచి గోల్డ్‌మెడల్ సాధించారు. నాట్యమే శ్వాసగా, ధ్యాసగా భావిస్తూ ఇప్పటిదాకా జాతీయ, అంతర్జాతీయస్థాయిలో వేలాది కూచిపూడి నాట్యప్రదర్శనలిచ్చి అనేక అవార్డులను, ఘన సన్మానాలను పొందారాయన. 2008లో అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో నాట్యప్రదర్శన చేసి సిలికానాంధ్ర సంస్థ నుంచి అవార్డు సాధించారు. మలేషియా, వియత్నాం, హాంకాంగ్, నేపాల్ తదితర దేశాల్లోనూ తన నాట్యప్రదర్శనలతో అందరినీ అలరించారు. కూచిపూడి కళాపీఠంలో యక్షగానం అధ్యాపకునిగా పన్నెండేళ్ల పాటు విధులు నిర్వహించి, అనంతరం చిన్నారులకు నాట్యం నేర్పి, నాట్యకళను మరింత దేదీప్యమానం చేయాలనే లక్ష్యంతో నెల్లూరుకు వచ్చి టెక్కేమిట్టలో 2012 నుంచి శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి కళాక్షేత్రాన్ని స్థాపించారు. నాటి నుంచి నేటి దాకా వేలాదిమంది బాలబాలికలకు నాట్యకళను నేర్పుతూ నాట్య గురువుగా ప్రఖ్యాతి చెందారు. ఇప్పటికే నాట్యకౌముది, నాట్యశేఖర, నృత్యాలంకార భూషణ, గురుశ్రీ, నాట్యరత్న, నాట్యాచార్య, మహాగురు, 'కూచిపూడి రత్న' వంటి ప్రతిష్టాత్మక బిరుదులను, పలు అవార్డులను సొంతం చేసుకున్నారు. కూచిపూడి నాట్యరంగంలో ఆయన చేస్తున్న విశిష్ట కృషిని గుర్తించి హోసూరు లోని ఆసియా వేదిక్ కల్చరల్ యూనివర్శిటీ వైస్‌చాన్సలర్‌తోపాటు, తమిళనాడుకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొని సాంబశివరావును అభినందించి గౌరవ డాక్టరేట్‌తో ఘనంగా సత్కరించడం విశేషం.

# మహాత్మాగాంధీ వర్ధంతి



అంతర్జాతీయ వైశ్యసమాఖ్య ఆధ్వర్యంలో జనవరి 30న మహాత్మా గాంధీజీ 76వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఆ సమాఖ్య ఉపాధ్యక్షులు, నెల్లూరులోని ఆర్యవైశ్యప్రముఖులు కెవి చలమయ్య గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాఖ్య అర్బన్ డెవలప్‌మెంట్ వైస్‌ఛైర్మెన్ ఆర్‌వి శరత్, పబ్లిక్ రిలేషన్స్ కమిటీ వైస్‌ఛైర్మెన్ జెవికె బాబు, సర్వీస్ కమిటీ వైస్ ఛైర్మెన్ ఎస్ నాగేశ్వరరావు, టూరిజం కమిటీ ఛైర్మెన్ నగరకంటి రవీంద్ర, సోమిశెట్టి వెంకటరత్నం, ఆర్‌వి శేషగిరి, వై.మహేష్ తదితర ఆర్యవైశ్య ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



**2023-24 సంవత్సరానికి రోటరీ అసిస్టెంట్ గవర్నర్‌గా నామినేట్ అయిన రోటేరియన్ డా. బి.శ్యామసుందరరావు (మయూరి శ్యాంయాదవ్)ని సత్కరిస్తున్న రోటేరియన్ వొమ్మిన సతీష్‌బాబు, డా. సి.జనార్ధన్‌రెడ్డి, డా. సి.రోహిణి, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు తదితరులు.**





## మోడీ నియంతృత్వ పాలన

### డిసిసి అధ్యక్షుడు చేవూరు విమర్శ

ప్రధాని మోడీ పాలన నియంతృత్వంగా ఉందని, బిజెపి విధానాల వల్ల భావితరాల మనుగడకు ముప్పు వాటిల్లేలా ఉందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి విమర్శించారు. జనవరి 30న గాంధీజీ వర్ధంతి సందర్భంగా ఆయన నెల్లూరులోని ఇందిరాభవన్‌లో జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. దేశప్రజల కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్‌జోడో యాత్ర దిగ్విజయంగా జరుగుతోందన్నారు. సివి శేషారెడ్డి, సురేష్‌బాబు, భవానీనాగేంద్రప్రసాద్, శ్రీనివాసులురెడ్డి, వెంకట్రావు, ఫయాజ్, వెంకటేశ్వర్లు, రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## నాటి మహోన్నత దాతలకు..కళాభివందనాలు



నెల్లూరుసీమలో ప్రసిద్ధమైన పలువురు దాతలకు కళాభివందనాలు చెప్పు, నెల్లూరులోని 'ఏ ట్రస్ట్ ఏ ఫర్ ఆల్' సంస్థ జనవరి 29న స్థానిక టౌన్‌హాలు ప్రాంగణంలోని జూనియర్ రేబాల మందిరంలో కార్యక్రమం నిర్వహించింది. పురమందిరం(టౌన్‌హాలు) నిర్మాణ దాత రేబాల లక్ష్మీ నరసారెడ్డికి, విఆర్ కళాశాల దాత వెంకటగిరి రాజాకు, సర్వోదయ కళాశాల నిర్మాణ దాత, డికెడబ్ల్యు కళాశాల దాతలైన దొడ్ల కుటుంబానికి, కస్తూర్బా పాఠశాల దాత ప్రముఖ స్వాతంత్ర్యయోధురాలు పొణకా కనకమ్మ, నిరుపేద గిరిజనులను సముద్ధరించిన మహనీయుడు వెన్నెలకంటి రాఘవయ్య తదితర దాతలను స్మరించుకుంటూ వారి దాతృత్వాన్ని కొనియాడింది. ఈ సందర్భంగా భక్తిపాటల పోటీలు నిర్వహించి సభికు లను అలరించారు. ఆ సంస్థ అధ్యక్షులు అళహరి వెంకటేష్ ఆధ్వర్యంలో ఈ వినూత్న కార్యక్రమం ఆకట్టుకుంది. దాతల గురించి ఆయన రచించిన గీతం అందరి అభినందనలు అందుకుంది. ఈ సందర్భంగా పలువురు దాతలను సన్మానించారు. విశ్వ లక్ష్మీనరసింహప్రసాద్, మురళీమోహన్, ప్రసాద్‌బాబు, నాగేంద్ర, ప్రదీప్, మహమ్మద్ గౌస్‌బాషా, అమానుల్లాఖాన్, అరవ రాయప్ప, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు



### పురస్కార గ్రహీతలకు..

## విఎస్‌యు వీసీ అభినందన

గణతంత్ర దినోత్సవ వేడుకలలో జిల్లా కలెక్టర్ చేతులమీదుగా విశిష్ట సేవా పురస్కారాలను పొందిన విఎస్‌యు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులను మరియు వాలంటీర్లను విఎస్‌యు వీసీ ఆచార్య జిఎం సుందరవల్లి అభినందించారు. అవార్డు గ్రహీతలైన జానకిరామ్ (ఇంగ్లీష్ లెక్చరర్-జూనియర్ కళాశాల వెంకటగిరి), వెంకట ప్రసాద్ (ఎకనా మిక్స్ లెక్చరర్-విడవలూరు డిగ్రీ కళాశాల), దివ్య (తెలుగు లెక్చరర్ -దొడ్ల కౌసల్యమ్మ ప్రభుత్వ మహిళా కళాశాల), మంజునాథ్‌రెడ్డి (బోటనీ లెక్చరర్-వెంకటగిరి డిగ్రీ ప్రభుత్వ కళాశాల), మరియు యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్ శంకర్‌లతో పాటు వలంటీర్లు నవ్య, సాయికుమార్, ప్రియ, పృథ్వీరాజ్, సూర్యతేజలను వీసీ అభినందించారు.

## సైనిక సంక్షేమనిధికి 'మెప్మా' 75వేల విరాళం

సైనిక సంక్షేమనిధికి నెల్లూరులోని మెప్మా ప్రాజెక్టు తరపున ఆ ప్రాజెక్టు డైరెక్టర్ రవీంద్ర జనవరి 30న 70 వేల రూపాయల విరాళాన్ని కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబుకు డిడి రూపంలో అందజేశారు. మెప్మా పరిధిలోని స్వయం సహాయక సంఘ సభ్యులు, ఉద్యోగులు ఆ మేరకు విరాళాలందించారని, మరికొంత నగదును కూడా డిడి రూపంలో అందజేస్తామని రవీంద్ర ఈ సందర్భంగా కలెక్టర్‌కు చెప్పారు. సైనిక సంక్షేమానికి విరాళాలిచ్చిన మెప్మా సిబ్బందిని, రవీంద్రను, స్వయం సహాయక సభ్యులను కలెక్టర్ అభినందించారు.

## గాంధీజీకి వాకర్స్ నివాళి



నెల్లూరులోని వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా-2022 అధ్యక్షులు ఎంవి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో, వాకర్స్ ఇంటర్నేషనల్ వాకర్స్ జిల్లా-2023 గవర్నర్ ఎం.వెంకటాద్రి తదితరులు జనవరి 30న గాంధీజీ వర్ధంతి సందర్భంగా నెల్లూరులోని గాంధీవిగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ నలుబోలు బలరామయ్యనాయుడు, ఏకొల్లు రాఘవరెడ్డి, డివి పార్థసారథిరెడ్డి, కోశాధికారి శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బాలహనుమంతునికి విశిష్ట అలంకారం



నెల్లూరు పరమేశ్వరినగర్‌లో ఉన్న సాయికృష్ణ లేఅవుట్‌లో కొలువైవున్న అభయాంజనేయస్వామివారికి ఇటీవల ఆలయ అర్చకులు బ్రహ్మజ్ఞాని రాఘ వేంద్రగోవి స్వామి విశిష్టమైన అలంకారం చేసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలహను మంతుని బాల్యానికి గుర్తుగా జామ పండు లాంటి సూర్యుని అలంకా రంతో భక్తులను పరవశింపజేశారు. ఆలయ ధర్మకర్త దొంతంశెట్టి శ్రీనివాసులు-నిర్మలమ్మ దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పెద్దసంఖ్యలో శ్రీ హనుమాన్ భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తరించారు.

## ఆకట్టుకున్న పురాతన నాణేల ప్రదర్శన

నెల్లూరులోని ఓక్స్ స్కూల్‌లో జనవరి 28, 29 తేదీల్లో జరిగిన పురాతన నాణేలు, కరెన్సీనోట్లు, స్టాంపుల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ప్రజలతో పాటు, జిల్లాలోని పలు స్కూళ్ళనుంచి విద్యార్థులు పెద్దసంఖ్యలో వచ్చి తిలకించారు. రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఈ ప్రదర్శనకు ప్రారంభోత్సవం చేశారు. పాఠశాల డైరెక్టర్లు షణ్ముఖాచారి, వెంకటాద్రి, ప్రిన్సిపాల్ సుఖదాదాస్ తదితరులు పాల్గొన్నారు.

## 'తంగిరాల మహాభారతం' 41వ భాగం




పాండవులు లక్క ఇంట్లో ఇంకో ఆరు నెలలు దానధర్మాలు చేస్తూ గడుపుతారు. పురోచనుడు, తన గూఢచారిగా ఒక బోయ స్త్రీని కుంతీకి సాయంగా పెడతాడు. ఆమెకు 5గురు కుమారులు. ఆమె దొంగతనంగా సంభాషణలు పురోచనుడికి చేరవేస్తుంది. పురోచనుడు అనుకున్న కృష్ణ చతుర్దశి వస్తుంది. ఆరోజు కుంతీ నగరంలో ఉన్న బ్రాహ్మణ స్త్రీలకు భోజనంపెట్టి, దాన ధర్మాలు చేస్తుంది. ఆరోజు బోయ స్త్రీ, ఆమె కుమారులు బాగా తిని, తాగి పడుకుంటారు. పురోచనుడు కూడా ఇంకో భవంతిలో పడుకుని అర్ధరాత్రి కోసం చూస్తూ ఉంటాడు. ఇంతలో భీముడే పురోచనుడు పడుకున్న భవనాన్ని తగలపెట్టి, కుంతిని, సోదరులని లేపి ఎత్తుకుని సొరంగ మార్గం ద్వారా వేగంగా నడుచుకుంటూ అరణ్యంలోకి వెళ్ళిపోతాడు. లక్క ఇల్లు, దాని పక్కనున్న ఆయుధ కర్మాగారం, పురోచనుడు, బోయ స్త్రీ, ఆమె కుమారులు ఆ మంటల్లో బూడిద అయిపోతారు. మరునాడు హస్తిన ప్రజలు గుమిగూడి, 6 అస్తిపంజరాల్ని చూసి వాళ్ళే పాండవులనుకుం టారు. ఖనకుడు ఎవరికీ తెలియకుండా ఆ సొరంగాన్ని మూసేస్తాడు. ఆ వార్త హస్తినాపురంకి చేరుతుంది. ధృతరాష్ట్రుడు, భీష్మ, కౌరవ ప్రముఖులు, గాంధారి, రాణులు ఎంతో బాధపడతారు. దుర్యో ధనుడు ఎంతో సంతోషిస్తాడు, కానీ పురోచనుడు చనిపోయాడని చింతిస్తాడు. విదురుడు పాండవులు క్షేమంగా ఉన్నా రని ఆనందపడతాడు. భీముడు అలా కుంతిని, సోదరులని దక్షిణ దిక్కుగా అరణ్యంలో చాల దూరం మోసుకుని పోతాడు. సాయంకాలానికి ఒక చెట్టు దగ్గర వారిని దింపి, దగ్గరలో ఉన్న ఒక కొలనులో స్నానమాడి, ఆకు దోనెలో మంచినీరు పట్టుకు వస్తాడు.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది. పూర్తి నిడివి కోసం **Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.**








## 'శ్రీ సాయి సూక్తి శతకం' ఆవిష్కరణ

నెల్లూరుకు చెందిన ప్రముఖ పద్యకవి, జడ్పీ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు తోట రమణమూర్తి రచించిన 'శ్రీ సాయి సూక్తి శతకము' పుస్తకావిష్కరణ కార్యక్రమం ఇటీవల స్థానిక పొదలకూరురోడ్డులోని జడ్పీ హైస్కూల్ ఆవరణలో జరిగింది. ఇంటర్నేషనల్ వాకర్స్ డిస్ట్రిక్ట్-203 డెప్యూటీ గవర్నర్ మెట్టు సుధాకర్‌రెడ్డి, విశ్రాంత జైలు సూపరింటెండెంట్ టి. అనంతరావు తదితరులు పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించి కవి రమణమూర్తిని అభినందించారు. వాకర్స్ సభ్యులు ఎంబి కృష్ణయ్య, పి.బాలసుబ్రహ్మణ్యం, సిఎల్‌వి ప్రసాద్, షేక్ ఖాసిం పాల్గొన్నారు.

## బొగ్గరపు రాధాకృష్ణమూర్తికి అరుదైన గుర్తింపు



నెల్లూరు కవి బొగ్గరపు రాధాకృష్ణమూర్తికి ఇటీవల అరుదైన అంతర్జాతీయస్థాయి గుర్తింపు లభించింది. ఉత్తర అమెరికా తెలుగుసంఘం (తానా)వారు జనవరి 29న అంతర్జాతీయస్థాయిలో నిర్వహించిన అంతర్జాల దృశ్యసమావేశం 'తెలుగు సాహితీ సౌరభం' కార్యక్ర మంలో 'మామీల సృష్టికర్త' బొగ్గరపు రాధాకృష్ణమూర్తి విశిష్ట అతిథిగా పాల్గొని ప్రసంగించడం విశేషం. తెలుగు సాహిత్య చరిత్రలో అపూర్వ వేడుకగా నిర్వహిం చిన 50 మందికి పైగా సాహిత్యప్రక్రియలను సృజించిన వారిని ఒక వేదిక మీదికి తీసుకువచ్చింది 'తానా'. 75మందికి పైగానే పాల్గొన్న ఈ సమావేశంలో మామీల సాహితీప్రక్రియకు సంబంధించిన విశేషాలను ఆయన వివరించి తానా వారి నుంచి ప్రశంసా పత్రం అందుకున్నారు. తానా సమన్వయకర్త చిగురుమళ్ళ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

# తెలుగోళ్ళు తలచుకుంటే.. సాధించలేనిదేముంది?..

## చెన్నైలో కేంద్ర పర్యాటకశాఖ మంత్రి కిషన్‌రెడ్డి




'తెలుగోళ్ళు తలుచుకుంటే సాధించ లేనిదేముంది?..తెలుగోళ్ళంతా ఏకమై తమిళనాడులో హక్కుల కోసం పోరాడితే తమిళ ప్రభుత్వం సాయంత్రానికల్లా దిగొచ్చి జీఓ ఇవ్వదా?'..అని కేంద్ర పర్యాటకశాఖ మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అంతటి సత్తా ఇక్కడున్న తెలుగోళ్ళలో ఉందని కూడా ఆయన అన్నారు. జనవరి 30న ఆయన ఆలిండియా తెలుగు సమాఖ్య (ఏఐటిఎఫ్) ఆధ్వర్యంలో చెన్నైలోని ఆస్కా భవన్‌లో జరిగిన తెలుగువారి ఆత్మీయ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఇక్కడున్న వారు ఇతరభాషల పట్ల మక్కువ పెంచుకోవడం, తెలుగువారిని తమిళనాడు ప్రభుత్వం ఐక్యంగా ఉంచకపోవడం వంటి కారణాలతో ఇక్కడ తెలుగుభాష కనుమరుగయ్యే పరిస్థితి ఉందని ఆయన హెచ్చరించారు. ఏపిటిఎఫ్ అధ్యక్షులు ఆచార్య సిఎంకె రెడ్డి, తమిళనాడు బిజెపి నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ప్రముఖ సినీ నిర్మాత కాట్రగడ్డ ప్రసాద్, ఆంధ్ర సోషల్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కోవూరు వైకాపా యువజన విభాగం

# అధ్యక్షునిగా..నల్లపరెడ్డి రజిత్



కోవూరు నియోజకవర్గంలో యువజన విభాగాన్ని కూడా బలోపేతం చేయాలనే సంకల్పతో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ యువజన విభాగానికి కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇటీవల కమిటీని ఏర్పాటుచేశారు. అధ్యక్షునిగా నల్లపరెడ్డి రజిత్‌కుమార్‌రెడ్డిని నియమించారు. అదేవిధంగా కార్యవర్గసభ్యులుగా బెజవాడ వంశీకృష్ణారెడ్డి (ఊటుకూరు), మావులూరు అభినయ్ (రాముడుపాళెం), చీర్ల ప్రసాద్ (బుచ్చిరెడ్డిపాళెం), షేక్ చిన్న అల్లాభక్ష (బుచ్చిరెడ్డిపాళెం), కాటంరెడ్డి దినేష్‌రెడ్డి (పడుగుపాడు), దేవిరెడ్డి సాయి కోదండరామిరెడ్డి (యల్లాయపాళెం), గొల్లపల్లి అవినాష్ (పున్నూరు), కొండా శ్రీనివాసులురెడ్డి (రాజుపాళెం), కైలాసం శ్రీనివాసులురెడ్డి (కొత్తూరు), దొడ్డంరెడ్డి సుజిత్‌రెడ్డి (కోవూరు), ఆవుల శ్రీనివాస్ (ఆంజనేయపురం), పచ్చిపాల మన్మోహన్‌రెడ్డి (కోవూరు), షేక్ అహ్మద్ (పడుగుపాడు), అత్తిపల్లి అనూప్‌రెడ్డి (కోవూరు), శశిధర్‌రెడ్డి (తుమ్మగుంట), మహిధర్‌రెడ్డి (గంగపట్నం)లు నియమితులయ్యారు. యువజన విభాగానికి నియమితులైనవారంతా పార్టీ పటిష్టతకు కృషిచేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసన్న వారికి సూచించారు.

# కమీషన్ల కక్కుర్తితో..రైతులకు అన్యాయం చేస్తారా?..

### --- మాజీమంత్రి సోమిరెడ్డి ఆగ్రహం ---



కమీషన్ల కక్కుర్తితో వైకాపా నాయకులు రైతులకు అన్యాయం చేస్తున్నారంటూ మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. జనవరి 29న ఆయన సైదాపురం మండలంలోని దేగపూడి-బండేపల్లి కాలువ పనులు పరిశీలించారు. కట్టుబడిపల్లి వద్ద నుంచి ఆయన సైదాపురం నియోజకవర్గ టిడిపి నాయకులతో కలసి కాలినడకన వెళ్ళి ఆ కాలువను పరిశీలించి రైతులతో మాట్లాడారు. చివరి ఆయకట్టు భూములకు నీళ్ళొచ్చే విధంగా తాము అప్పటి సిఎం చంద్రబాబును ఒప్పించి సోమశిల-కండలేరు కాలువలను కలుపుతూ ప్రత్యేక ఉత్తర్వులు తీసుకొచ్చామని, దేగపూడి-బండేపల్లి లింక్ కాలువ నిర్మాణానికి భూసేకరణలు కూడా అప్పట్లోనే పూర్తిచేయించామని చెప్పారు. అయితే ఇప్పుడు ఆ కాలువ పనులు ఆపేయడం దారుణమని ఆయన అంటూ, 10 శాతం కమీషన్ల కోసం రైతుల నోట్లో మట్టికొడతారా?..9 నెలల్లో కాలువ పనులు చేస్తామని చెప్పి నాలుగేళ్ళయినా ఎందుకు చేయడం లేదో మంత్రి కాకాణి సమాధానం చెప్పాలన్నారు. వెంటనే దేగపూడి-బండేపల్లి దక్షిణ కాలువ పనులు మొదలుపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సోమిరెడ్డి వెంట వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తదితరులున్నారు.






# 7వ వర్ధంతి

నిష్కల్మష హృదయుడు, నిస్వార్థ సేవాతత్పరుడు,

నిరంతర ప్రజాసేవకుడు

## చిట్టమూరు పద్మనాభరెడ్డి గారు

(మాజీ వైస్ ఛైర్మెన్, జిల్లా ప్రజాపరిషత్, నెల్లూరుజిల్లా)

పరమపదించి తేది. 9.2.2023 నాటికి ఏడేళ్ళు గడుస్తాయి.

**వారి దివ్యస్మృతికి అంజలి ఘటిస్తూ...**

బావమరిది / అల్లుడు - కుమార్తె

**ప్రొ॥ సి.యం.కె.రెడ్డి - శ్రీమతి నిర్మల**, చెన్నై

కోడలు

**డా॥ సి.భారతి**, యు.యస్.ఏ

(W/o. లేట్. డా॥ సి.మధుసూదన్‌రెడ్డి)

మనుమరాలు, మనుమడు

**ప్రణీత అరవింద్, లోహిత్**, యు.యస్.ఏ

మనుమడు - మనుమరాలు

**డా॥ సి.యం.కిషోర్ - శ్రీమతి లీలాదేవి**, చెన్నై

మనుమరాలు - మనుమడు

**శ్రీమతి హరిత - డా॥ రామానందరెడ్డి**, కాకినాడ

మునిమనుమలు మునిమనుమరాండ్రు

**జయేష్ & అష్మిత** **కీర్తన లక్ష్మి & తనవ్**

# శ్రీసిటీలోని.. 'సిద్ధార్థ లాజిస్టిక్స్'కు అవార్డు

## 'అతిపెద్ద దిగుమతిదారు'గా గుర్తింపు




శ్రీసిటీకి చెందిన సిద్ధార్థ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమకు 2021-22 ఆర్థిక సంవత్సరంలో 'అతిపెద్ద దిగుమతిదారు' అవార్డు దక్కింది. జనవరి 28న అంతర్జాతీయ కస్టమ్స్ దినోత్సవం-2023 సందర్భంగా విశాఖపట్నంలో జరిగిన ఓ కార్యక్రమంలో విజయవాడ కస్టమ్ ప్రివెంటివ్ కమిషనరేట్ కార్యాలయం, కస్టమ్స్ సెంట్రల్ ట్యాక్సస్ చీఫ్ కమిషనర్ నుండి సిద్ధార్థ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ నిశ్చల్ పాధ్య ఆ ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్నారు. ఏడాదిలో సిద్ధార్థ లాజిస్టిక్స్ రూ. 1.47లక్షల కోట్ల దిగుమతులతో పాటు రూ. 16,293 కోట్ల దిగుమతి సుంకం చెల్లించిందని, తమ పరిశ్రమ సిబ్బంది అత్యుత్తమ పనితీరు, సమిష్టి కృషికి గుర్తింపుగా ఈ ఘనత దక్కిందని నిశ్చల్ పాధ్య పేర్కొన్నారు. సిద్ధార్థ లాజిస్టిక్స్ బృందానికి ఇది ఎంతో గర్వకారణమని అన్నారు. ఈ సందర్భంగా సిద్ధార్థ లాజిస్టిక్స్ బృందానికి శ్రీసిటీ మేనేజింగ్‌డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభినందనలు తెలిపారు. తమ పారిశ్రామిక కుటుంబంలో ఒకరైన సిద్ధార్థ లాజిస్టిక్స్ 'అతిపెద్ద దిగుమతిదారు' దిగుమతి సుంకం చెల్లింపుదారు'గా ర్యాంక్ పొందడం శ్రీసిటీకి గర్వకారణమన్నారు. భారతదేశ ఆర్థిక కార్యకలాపాల వృద్ధిలో భాగంగా ఫ్రీట్రేడ్ మరియు వేర్‌హౌసింగ్ జోన్ ఒక అవకాశంగా భావించి, సిద్ధార్థ లాజిస్టిక్స్ 2014లో శ్రీసిటీలో తన యూనిట్‌ను ప్రారంభించిందని, పలు ఉత్పత్తులకు గిడ్డంగి సదుపాయాలను కూడా కల్పిస్తూ పెద్దఎత్తున దిగుమతులు, ఎగుమతులు నిర్వహిస్తుందని పేర్కొన్నారు. సిద్ధార్థ లాజిస్టిక్స్ సేవలు వినియోగదారులకు ప్రయోజనకరంగా ఉంటూ ఏడాదికేడాది కంపెనీ పురోగమన బాటలో పయనిస్తోందని పేర్కొన్నారు.

# సరికొత్త ఆవిష్కరణలకు విద్యార్థులు కృషిచేయాలి




సైన్స్‌కు సంబంధించిన పరిశోధనలు ఇంకా విస్తృతంగా జరగాలని, ఆ ప్రయోజనాలు మానవాళికి అందాలని, ఆ దిశగా సరికొత్త ఆవిష్కరణలకు విద్యార్థులు కృషిచేయాలని, అందుకు విద్యార్థి దశ నుంచే సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని రాష్ట్ర వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆకాంక్షించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంలో వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని, ఆ దిశగా రాష్ట్ర వ్యాప్తంగా సైన్స్‌ఫేర్‌లను పెద్దఎత్తున ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఆయన తెలిపారు. జనవరి 28న నెల్లూరు నగరంలోని దర్గామిట్ట జిల్లాపరిషత్ బాలుర హైస్కూల్లో జిల్లాస్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శనను జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు, మేయర్ స్రవంతితో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ, మండల స్థాయి సైన్స్‌ఫేర్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. విద్యార్థులందరూ సైన్స్‌ఫేర్‌లో మొక్కుబడిగా కాకుండా ఆసక్తితో ఉత్సాహంగా పాల్గొని సరికొత్త ఆవిష్కరణలకు నాంది పలికే దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా విద్యా వ్యవస్థలో ముఖ్యమంత్రి విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చారని, విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దఎత్తున కృషి చేస్తోందని చెప్పారు. జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు మాట్లాడుతూ, మానవ జీవితంలో సైన్స్ చాలా కీలకపాత్ర పోషిస్తుందని, సైన్స్ గొప్పతనాన్ని తెలుసుకొని విద్యార్థులందరూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించాలని చెప్పారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన వైజ్ఞానిక ప్రదర్శనలను తిలకించి విద్యార్థులను అభినందించారు. మండల స్థాయిలో ఎంపికైన 186 ప్రదర్శనలను ఈ సైన్స్‌ఫేర్‌లో విద్యార్థులు ఏర్పాటు చేశారు. వీటిల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికవుతారని జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు పేర్కొన్నారు. వైకాపా సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, విద్యాశాఖ ఆర్‌జేడీ సుబ్బారావు, సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి, హెచ్ఎం జయమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

# పల్లిపాడు ఆశ్రమంలో.. గాంధీజీ వర్ధంతి

ఇందుకూరుపేట మండలం పల్లిపాడులోని పినాకిని గాంధీ ఆశ్రమంలో జనవరి 30న మహాత్మాగాంధీజీ వర్ధంతి కార్యక్రమం జరిగింది. మాజీమంత్రి, ప్రభుత్వ చీఫ్‌విప్ డొక్కా మాణిక్యవరప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఆశ్రమంలోని గాంధీజీ విగ్రహానికి, ఆశ్రమ స్థలదాత పొణకా కనకమ్మ విగ్రహానికి పట్టువస్త్రాలు, పూలమాలలు సమర్పించారు. రెడ్‌క్రాస్ కోశాధికారి సురేష్‌జైన్, కో-కన్వీనర్ రవీంద్రరెడ్డి, డాక్టర్ ఏవి సుబ్రహ్మణ్యం, గణేశం సుమంత్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ సుధాకర్, కల్పనమ్మ, మంజుల పాల్గొన్నారు.

# ఎన్‌బికెఆర్‌లో ప్రాంగణ ఎంపికలు



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఇటీవల చెన్నైకి చెందిన ప్రముఖ బహుళజాతి సంస్థ 'ఎక్సెల్లాకామ్' కంపెనీవారు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. అమెరికాలోని వర్జీనియాకి చెందిన ఆ కంపెనీ ప్రతినిధులు వెంకట్, మెనీషాల పర్యవేక్షణలో ఈ ఎంపికల కోసం పలు పరీక్షలు నిర్వహించారు. ఎంపికైన వారికి ఆన్‌లైన్‌లో టెక్నికల్ ఇంటర్వ్యూ నిర్వహించి ఉత్తీర్ణులైనవారికి నియామక పత్రాలు అందజేస్తామని చెప్పారు. మొత్తం 135 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారని, ఎంపికైనవారికి వార్షిక వేతనంగా 7.5 లక్షల రూపాయల వరకు ఇస్తారని ఎన్‌బికెఆర్ కళాశాల ప్రాంగణ ఎంపికల అధికారి డా. ఎన్ కిషోందర్ తెలిపారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# ప్రపంచానికే మార్గదర్శకులు మహాత్మా గాంధీ

### లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మెన్ షేక్ రియాజ్ అహ్మద్




భారతదేశానికే కాకుండా ప్రపంచానికే మార్గదర్శకులు మన జాతిపిత మహాత్మా గాంధీ అని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మెన్ షేక్ రియాజ్ అహ్మద్ అన్నారు. సోమవారం బాపూజీ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి లయన్స్ క్లబ్ సభ్యులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ అహింసావాదంతో గాంధీజీ ప్రపంచదేశాల మన్ననలు పొందారన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కల్యాణ్ సాయి, డిస్ట్రిక్ట్ చైర్మెన్ రామమోహన్, మురళీరెడ్డి, ఆర్. రవీంద్రరెడ్డి, ఎం. రూపేష్‌రెడ్డి, మదనమేటి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షికోత్సవాలు



ఫిబ్రవరి 6వతేదీ నుండి 10వతేదీ వరకు గూడూరు బాలాజీనగర్ లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం 14వ వార్షికోత్సవాలు అత్యంత వైభవంగా జరుగనున్నాయని ఆలయ కమిటీ తెలిపింది. 6వ తేదీ వార్షికోత్సవాలకు అంకురార్పణ మొదలవుతుందని, 10వ తేదీ లక్షతులసి పూజ, మహాపూర్ణాహుతి, మధ్యాహ్నం అన్నదానం జరుగుతుందని, భక్తులు స్వామివారి పూజా కార్యక్రమాలలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని దేవస్థానం కమిటీ పేర్కొంది.

# ఘనంగా లిటిల్ ఏంజల్స్ 38వ వార్షికోత్సవ వేడుకలు







గూడూరులోని లిటిల్ ఏంజల్స్ పబ్లిక్ స్కూల్ 38వ వార్షికోత్సవం ఆ పాఠశాల కరస్పాండెంట్ బుస్సారెడ్డి శ్రీకాంత్‌రెడ్డి గత నెల 28న ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ప్రత్యేకించి భక్త ప్రహ్లాద నాటకం విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి నెల్లూరు కృష్ణచైతన్య విద్యాసంస్థల చైర్మెన్ పి. చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోనే ఉజ్వలభవిష్యత్తు ఉంటుందని, విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకొని వాటి సాధనకు కష్టపడి చదవాలన్నారు. క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ఏపి కరస్పాండెంట్ బుస్సారెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, బి. సుబ్రహ్మణ్యంరెడ్డి, ఎమ్. దయాకర్ రెడ్డి, రామమోహన్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, ఓం నమశ్శివాయ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి సమస్యకీ వారంలోపు చర్యలు



రెవిన్యూ డివిజనల్ అధికారి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి, మండల స్థాయి అధికారులతో గత నెల 30వ తేదీ ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహించారు. చిట్టమూరులోని ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్‌చక్రవర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ అర్జీదారులు ఇచ్చిన ప్రతి సమస్యపై వారంలోపు చర్యలు తీసుకొని, వారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు.



**జనవరి 26వ తేదీ 74వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో గూడూరు మున్సిపల్ కమిషనర్ తోట సాయినాథ్‌కు ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా అవార్డును అందజేస్తున్న తిరుపతి జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డి, ఎస్.పి పరమేశ్వరరెడ్డి.**

# భక్తిశ్రద్ధలతో.. రథసప్తమి



రథసప్తమిని పురస్కరించుకుని జనవరి 28న జిల్లాలోని అనేక ఆలయాల్లో సూర్యభగవానునికి ప్రత్యేకపూజలు జరిగాయి. ప్రత్యేకించి ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రాపూరు మండలం పెంచలకోనలో శ్రీ లక్ష్మీనృసింహునికి వేకువనే అభిషేకం చేసి విశేషాభరణాలతో అలంకరించి పూజలు చేశారు. సప్తవాహనాలను అలంకరించి స్వామివారిని ఊరేగించారు. సూర్యప్రభ వాహనం, శేషవాహనం, సింహవాహనం, బంగారు గరుడ వాహనం తదితర వాహనసేవల్లో శ్రీ స్వామివారు నయనమనోహరంగా భక్తులకు దర్శనమిచ్చారు. పుష్కరిణిలో అభిషేకాలు, శ్రీచక్రస్నానం అనంతరం హనుమంతవాహనం, అశ్వవాహనోత్సవాలను నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ఛైర్మెన్ చెన్ను తిరుపాల్‌రెడ్డి, ఇఓ కోవూరు జనార్ధనరెడ్డి పర్యవేక్షించారు.

### శ్రీ రంగనాథాలయంలో :



ప్రముఖ పుణ్యక్షేత్రమైన నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథస్వామి దేవస్థానంలో స్వామివారికి రథసప్తమి సందర్భంగా సప్తవాహనసేవలు వైభవంగా నిర్వహించారు. సూర్యప్రభ వాహనం, సింహవాహనం, పొన్నవాహనం, గరుడవాహన సేవలతో పాటు స్వామివారికి తిరుమంజనం తదితర విశిష్టపూజలు చేశారు. చక్రస్నానం అనంతరం, బంగారు తిరుచ్చిపై ఊరేగించారు. రాత్రికి చంద్రప్రభవాహనంలో స్వామివారిని కొలువుదీర్చి ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

# కాకర్ల ట్రస్ట్ ఔదార్యం

## గేదెలు చనిపోయిన బాధితునికి లక్ష సాయం



కలిగిరి మండలంలోని తూర్పు దూబగుంట గ్రామంలో పేదరైతు బొట్టా మాల్యాద్రికి చెందిన అయిదు పాడిగేదెలు ఇటీవల ప్రమాదవశాత్తూ విద్యుత్‌తీగలు పడి చనిపోయాయి. దీంతో ఆ రైతు కుటుంబం ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న కాకర్ల ట్రస్ట్ అధినేత కాకర్ల సురేష్ తమ ట్రస్ట్ తరపున ఆ కుటుంబానికి లక్ష రూపాయల సాయం అందజేశారు. జనవరి 29న ఆయన తూర్పు దూబగుంటకు వెళ్ళి ఆ సాయం అందించారు. ఆయన వెంట కాకర్ల వెంకటసుబ్బానాయుడు, ట్రస్ట్ సభ్యులు, గ్రామస్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కోవిడ్ టీకా రెడీ

కోవిడ్ కేసులు దేశంలో అక్కడక్కడా వస్తున్న నేపథ్యంలో ముందుజాగ్రత్తగా 18ఏళ్ళు దాటిన వారికి కేంద్రప్రభుత్వం మళ్ళీ టీకాను పంపింది. ఈ నేపథ్యంలో నెల్లూరుజిల్లాకు 23వేల డోసుల కోవిషీల్డ్ టీకా వచ్చింది. ఈ టీకాను ప్రభుత్వాసుపత్రులకు పంపిణీ చేశారు కూడా. 18 ఏళ్ళు నిండినవారు రెండో డోసుతో పాటు, ప్రికాషన్ డోసు కూడా వేయించుకోవచ్చునని అధికారులు తెలిపారు. జిల్లాలో 18ఏళ్ళు నిండినవారు దాదాపు 20లక్షల మంది దాకా ఉన్నట్లు అంచనా. ఇప్పటివరకు రెండో డోసు టీకా వేయించుకోనివారు, మూడో డోసు వ్యాక్సిన్ వేయించుకోనివారు వెంటనే టీకా వేయించుకుని కోవిడ్ నుంచి రక్షణ పొందాలని డిఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ పెంచలయ్య సూచించారు. ముక్కుద్వారా వేసే టీకాను కూడా కేంద్రం అనుమతించిన నేపథ్యంలో, అది కూడా జిల్లాకు త్వరలోనే వస్తుందని భావిస్తున్నామన్నారు. కోవిడ్ టీకాకు కొరత ఉండదని, ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రభుత్వాసుపత్రులకు పంపుతుందని, కనుక ప్రజలు టీకా వేసుకోవాలని ఆయన కోరారు.

# పేదల అభ్యున్నతే ధ్యేయం




రాష్ట్రంలోని అన్ని వర్గాల పేదలకు అండగా ఉంటూ వారి అభ్యున్నతికి ప్రభుత్వం ద్వారా అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. జనవరి 30న పల్నాడు జిల్లా, వినుకొండ నుండి 'జగనన్న చేదోడు పథకం' మూడోఏడాది కింద లబ్ధిదారుల ఖాతాలోకి నగదు జమచేసే బృహత్తర కార్యక్రమాన్ని సిఎం ప్రారంభించారు. రాష్ట్రంలో 3,30,145 మంది అర్హులైన రజక, నాయిబ్రాహ్మణ, దర్జీ అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లకు రూ. 330.14 కోట్ల ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారుల ఖాతాలో జమ చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. జగనన్న చేదోడు క్రింద ప్రతి ఏడాది 10వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించడం జరుగుతుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు నెల్లూరు కలెక్టరేట్ నుంచి రాష్ట్ర వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్.చక్రధర్‌బాబు, బొందిలి కార్పొరేషన్ చైర్మన్ బి.కిశోర్‌సింగ్, బి.సి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బ్రహ్మానందరెడ్డి, డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, జిల్లా బిసి సంక్షేమశాఖ అధికారి వెంకటయ్య, జగనన్న చేదోడు లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబుతో కలిసి జగనన్న చేదోడు పథకం కింద జిల్లాలోని 18,522మంది లబ్ధిదారులకు 18.522 కోట్ల రూపాయల మెగా చెక్కును అందచేశారు. స్వయంఉపాధి ద్వారా జీవనం సాగిస్తున్న రజక, నాయిబ్రాహ్మణ, టైలర్స్ వృత్తిదారులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటూ జగనన్న చేదోడు పథకం కింద ప్రతి సంవత్సరం 10 వేల రూపాయల వంతున 5 సంవత్సరాల పాటు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు ఈ సందర్భంగా మంత్రి కాకాణి తెలిపారు. ఈ పథకం కింద జిల్లాలో మొత్తం మూడు విడతల్లో కలిపి 51కోట్ల రూపాయల మేర ఆర్థిక సహాయాన్ని అందచేయడం జరిగిందని మంత్రి వివరించారు. తొలుత, మహాత్మా గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకుని గాంధీజీ చిత్రపటానికి మంత్రి కాకాణి, కలెక్టర్ చక్రధర్‌బాబు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

# సోమశిల మరమ్మతు పనుల్లో నిర్లక్ష్యం విడనాడాలి

## ప్రభుత్వానికి బిజెపి నేత మిడతల వినతి



సోమశిల ప్రాజెక్టులో పెండింగ్‌లో ఉన్న ఆప్రాన్ మరమ్మతు పనుల్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తోందంటూ బిజెపి నమామి గంగే రాష్ట్ర ప్రముఖ్ మిడతల రమేష్ విమర్శించారు. ఇటీవల ఆయన నెల్లూరు కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్‌ను కలుసుకుని వినతిపత్రం సమర్పించారు. 2021లో వచ్చిన వరదలకు డ్యామ్ ముందు భాగంలో దెబ్బతిన్న ఆప్రాన్ మరమ్మత్తు పనులు నేటికీ సక్రమంగా జరగడం లేదని, ఆ పనులు ఇప్పుడు నిలిచిపోయాయని, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులను అర్ధాంతరంగా ఆపివేశారని పేర్కొన్నారు. అటువంటి ముఖ్యమైన పనులకే రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు, ఇప్పటికైనా ఆ పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సోమశిల జలాశయానికి ఇరువైపులా ఉన్న రక్షణ గోడలు దెబ్బతిన్నాయి. వాటిని నిర్మించే విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోందని, దక్షిణం వైపున ఉన్న శివాలయం వద్ద రక్షణ గోడలు కూడా బీటలు వారాయని తెలిపారు. సోమశిల జలాశయం నుండి కండలేరుకు నీటిని విడుదల చేసే రెండు గేట్లలో ఒక గేటు మొరాయిస్తోందని, సోమశిల డ్యాం క్రస్ట్ గేట్లు లీకేజీలకు గురై ఉన్నాయని, అంతర్‌రాష్ట్ర ప్రాజెక్టు మరియు బహుళార్థ సాధక ప్రాజెక్టు అయిన సోమశిల జలాశయం మరమ్మత్తుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యవైఖరి విడనాడాలని ఆయన కోరారు. బిజెపి నేతలు చిలకా ప్రవీణ్‌కుమార్, యాకసిరి ఫణిరాజు, ఆదినారాయణ, డాంగే నాయుడు, ఓజిలి సుధాకర్, ముప్పల రాంబాబు, కె.వెంకటరమణ, పులి విజయభాస్కర్, ప్రభాకర్, ప్రదీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 11న..జాతీయ లోక్‌అదాలత్

జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఫిబ్రవరి 11వ తేదీన జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ఛైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.యామిని, సంస్థ కార్యదర్శి..ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి శ్రీనివాసులునాయక్ ఇటీవల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని పలు న్యాయస్థానాల్లో అపరిష్కృతంగా ఉన్న సివిల్, క్రిమినల్ కేసులు, ప్రమాదాలకు సంబంధించిన కేసులు, కుటుంబ వివాదాలతో పాటు రాజీకి అమోదయోగ్యమైన కేసులను లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని వారు సూచించారు. కక్షిదారులు, న్యాయవాదులు లోక్‌దాలత్‌ను వినియోగించుకుని కేసుల పరిష్కారానికి సహకరించాలని కోరారు.

# టూకీగా...



## పెంచలకోనలో.. అన్నదానానికి లక్షా నూటపదహార్లు

జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెంచలకోన లక్ష్మీనృసింహస్వామి దేవాలయానికి వచ్చే భక్తుల అన్నప్రసాద వితరణకు చేజర్లకు చెందిన ఉడతా చిన్నయ్య-సుబ్బమ్మ దంపతులు ఇటీవల లక్షా నూటపదహారు రూపాయలను విరాళంగా సమర్పించుకున్నారు. ఆ మొత్తాన్ని ఆలయ ఇఓ కె.జనార్ధన్‌రెడ్డికి అందజేశారు.

## సీతారామపురంలో ఉచిత వైద్యశిబిరం

మండల కేంద్రమైన సీతారామపురం బిట్-1 సచివాలయంలో ఇటీవల ఉచిత వైద్యశిబిరం ఏర్పాటుచేసి రోగులకు కంటిపరీక్షలు చేశారు. నారాయణ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రంజిత్, డాక్టర్ జహీర్‌ఖాన్‌లు పాల్గొని వైద్యపరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ కొడవటిగంటి భాగ్యమ్మ సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది.

## పెనుబర్తిలో..ఉపాధి పనులు తనిఖీ

నెల్లూరు రూరల్ మండలంలోని పెనుబర్తి గ్రామంలో ఉపాధి పనులను జనవరి 27న రూరల్ ఎంపిడిఓ శైలేంద్ర కుమార్ తనిఖీ చేశారు. అక్కడ పనిచేస్తున్న కూలీల గురించి, జరుగుతున్న పనుల గురించి అడిగి తెలుసుకుని వారికి తగు సూచనలిచ్చారు. పంచాయతీ కార్యదర్శి ఫిరోజ్, ఫీల్డ్ అసిస్టెంట్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జోరేపల్లిలో..భరతమాతకు పూజలు

ప్రజల్లో దేశభక్తిని పెంపొందిస్తూ సమరసత సేవాసమితి కన్వీనర్ గణపతి ఆధ్వర్యంలో జనవరి 27న రాపూరు మండలం జోరేపల్లి గ్రామంలో భరతమాత చిత్రపటానికి పూలమాలలు వేసి ఊరేగింపుగా తీసుకువచ్చి, భక్తిశ్రద్ధలతో రామాలయంలో పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో గ్రామస్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కొమ్మలపూడిలో..వేమాలమ్మ తల్లికి అభిషేకాలు

మనుబోలు మండలంలోని కొమ్మలపూడి గ్రామంలో ఉన్న శ్రీ వేమాలమ్మ అమ్మవారి దేవస్థానంలో జనవరి 29న ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. అర్చకులు రఘురామయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజాకార్యక్రమాల్లో ఏఎంసి ఉపాధ్యక్షులు చందులూరు శ్రీనివాసయాదవ్, ఉభయకర్తలు చందులూరు వెంకయ్య-సుగుణమ్మ దంపతులు పాల్గొన్నారు.

## ఉలవపాడు యుటిఎఫ్‌కు కొత్త కమిటీ

ఉలవపాడు యుటిఎఫ్ (యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్) మండల శాఖకు జనవరి 29న కొత్తకమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షునిగా ఎల్.వేణుగోపాల్, అధ్యక్షునిగా జి.నాగేంద్రరావు, సహాయ అధ్యక్షులుగా జి.జాలయ్య, కె.విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా ఎస్.జాలయ్యతో పాటు మరికొంతమంది కమిటీసభ్యులను ఎన్నుకున్నారు.

## నెల్లూరులో పేకాటరాయుళ్ళ అరెస్ట్

నెల్లూరు గోమతినగర్‌లో పేకాటాడుతున్న ముగ్గురిని పోలీసులు పట్టుకుని, వారి వద్ద నుంచి 5వేల రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. పేకాటాడుతున్నారన్న సమాచారంతో దర్గామిట్ట పోలీసులు వారిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు.

## కొంగ కోసం వెళ్ళి.. ప్రాణాలు పోగొట్టుకున్నాడు

కొంగల వేటకు వెళ్ళి ప్రమాదవశాత్తూ వాగులో మునిగిపోయి ప్రాణాలు పోగొట్టుకున్నాడో వ్యక్తి. ఏఎస్‌పేట మండలం జమ్మవరానికి చెందిన పెంచలయ్య అనే కూలి కొంగలు పట్టుకోవడానికి చిరమన వాగువద్దకు వెళ్ళి క్యాట్‌బాల్‌తో కొంగలను కొట్టాడు. వాగులో పడిన ఓ కొంగను తెచ్చుకునేందుకు ఈదుకుంటూ వెళ్ళి మధ్యలో మునిగిపోయి మరణించాడు. ఏఎస్‌పేట పోలీసులు కేసు దర్యాప్తుచేస్తున్నారు.

## కందుకూరులో అంకమ్మ గుడికి విరాళం

కందుకూరులో గ్రామదేవత అంకమ్మ గుడి నిర్మాణానికి కుంచాల వెంకటేశ్వర్లు జ్ఞాపకార్ధం వారి కుటుంబసభ్యులు జనవరి 30న లక్షా నూటపదహారు రూపాయలను విరాళంగా సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో వెంకటరెడ్డి, ఆవుల మాధవరావు తదితరులు పాల్గొన్నారు.


## కళ్యాణ వైభోగం....!



కొత్తకోడూరు వాస్తవ్యులు కావల్‌రెడ్డి శ్యామసుందర్ - షర్మిలల కుమార్తె **ప్రశశ్వి - శ్యామ్‌సుందర్‌రెడ్డి** (నెల్లూరు వాస్తవ్యులు నోటి కొండస్వామిరెడ్డి - శ్రీలతల కుమారుడు)ల పరిణయం జనవరి 26వ తేదీ నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభాభినందనలు.



నెల్లూరు వాస్తవ్యులు యేటూరు గోవర్ధన్‌రెడ్డి - విజయలక్ష్మిల మనుమడు, యేటూరు అశోక్‌కుమార్‌రెడ్డి - రాధికల కుమారుడు **సాయి కళ్యాణ్ - కీర్తిక** (నెల్లూరు వాస్తవ్యులు యరబోలు శశిధర్‌రెడ్డి - నజినిల కుమార్తె)ల వివాహం జనవరి 27వ తేదీ నెల్లూరులోని సిపిఆర్ కళ్యాణ మండపంలో వైభవంగా జరిగింది. నూతన దంపతులకు 'లాయర్' శుభాశీస్సులు.



మనుబోలు మండలం, పిడూరు గ్రామ వాస్తవ్యులు మన్నెమాల వెంకటస్వామిరెడ్డి - లీలావతమ్మల మనుమడు, మన్నెమాల శ్రీనివాసులరెడ్డి - అపర్ణల కుమారుడు **డా॥ సిరి మౌనిష్ - డా॥ హేమమాన్వి** (నెల్లూరు వాస్తవ్యులు బడి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి - లావణ్యల కుమార్తె)ల కల్యాణం జనవరి 27వ తేదీ నెల్లూరులో వైభవంగా జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

# సీతమ్మ సిత్రాలు



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ భారతదేశ భవిష్యత్తుకు పునాది రాయిగా పేర్కొన్నారు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్. ప్రపంచం భారత ఆర్థిక వ్యవస్థను ఒక ధృవతారగా గుర్తించినట్లు ఈ సందర్భంగా ఆమె చెప్పారు. మన భారతదేశ ఆర్థికాభివృద్ధి 7శాతంగా అంచనా వేస్తూ, ప్రపంచ పటాన అగ్రభాగాన నిలబడిందని ఆమె విశదీకరించారు. ఎన్నో సమస్యలున్నా మన భారత్ సాధించిన విజయమన్నారు. ఇది నిజంగా నిజమే.

కోవిడ్ సమయంలో 80కోట్ల ఆహారధాన్యాలను 28 నెలల పాటు అందించామని చెప్తూ నిర్మలా సీతారామన్, పిఎంజికెఏవై క్రింద కొన్ని వర్గాల వారికి ఈ సంవత్సరం జనవరి 1, 2023 నుంచి ఒక సంవత్సరం పాటు ఆహారధాన్యాలను ఉచితంగా అందించబోతున్నామని ప్రకటించారు. దీనికి సుమారు 2లక్షల కోట్లు ఖర్చు చేయబోతున్నట్లుగా చెప్పారు. ఇది ఘనమైన విషయమే!

2014 నుండి ప్రభుత్వ చర్యల ద్వారా ప్రజల తలసరి ఆదాయాన్ని రెండింతలు చేయగలిగామని సీతారామన్ సంతృప్తి వ్యక్తపరిచారు. ఈ తొమ్మిదేళ్ళలో భారతదేశ ఆర్థిక పరిమాణాన్ని 10వ స్థానం నుంచి 5వ స్థానానికి నిలబెట్టామని ఎంతో ఆనందంగా చెప్పారామె. ఇది గర్వించదగిన సమయమే!

దీనదయాళ్ అంత్యోదయ యోజన ద్వారా పల్లెల్లో నివసించే స్త్రీలను 81లక్షల స్వయంసహాయక సంఘాలుగా విభజించడం జరిగినట్లు సీతారామన్ చెప్పారు. వీరిని ఆర్థిక శక్తిగా తయారుచేయడం కోసం కొత్త విధివిధానాలను రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. స్త్రీలలో నాయకత్వ లక్షణాల్ని గుర్తించి అవకాశాలు కల్పించడం అభినందించాల్సిన విషయం.

చేతివృత్తి కళాకారులకు ఆధునిక శిక్షణ ఇచ్చి ప్రపంచ మార్కెట్లకు చేరువచేయబోతున్నామని చెప్పారు.

రాష్ట్ర ప్రభుత్వాల సహాయ సహకారాలతో పర్యాటక రంగాన్ని సైతం అభివృద్ధి చేయబోతున్నామన్నారు. చాలా సంతోషకరమైన వార్తలుగా పేర్కొనవచ్చు. వ్యవసాయ ఋణాలను 20లక్షల కోట్లకు పెంచుతూ, ప్రధానమంత్రి మత్స్య సంపదయోజన క్రింద 6,000 కోట్లు చేపల పరిశ్రమలో పెట్టుబడికి రంగం సిద్ధం చేసినట్లు ఆర్థికమంత్రి తెలిపారు. మత్స్యకారుల రొట్టె విరిగి నేతిలో పడ్డట్లయ్యింది.

భారతదేశంలో ఉండే 63,000 వ్యవసాయ సంఘాలను కంప్యూటరీకరించడం ద్వారా ఒకే చెట్టు క్రిందకు తీసుకువస్తున్నట్లు చెప్పారామె. దీనివల్ల ఒకరికొకరు కలిసి ఎదగడానికి దోహదపడుతుంది.

ఇప్పుడు భారతదేశ వ్యాప్తంగా ఉండే 157 మెడికల్ కాలేజీలకు అనుసంధానంగా 157 నర్సింగ్ కాలేజీలను ప్రారంభించి 2047 సంవత్సరం నాటికి అనీమియా వ్యాధిని అంతమొందించడానికి మార్గాలను అన్వేషిస్తామన్నారు. ఇది చాలామంచి కార్యక్రమం. ఫార్మా మరియు ఆరోగ్య రంగాలలో పరిశోధనలు చేస్తూ, ఆరోగ్య రంగాల్లో కొత్త విద్యా కోర్సులను ప్రవేశపెడతామన్నారామె.

38,800 మంది ఉపాధ్యాయులను మరియు సహాయకులను 740 ఏకలవ్య మోడల్ నిర్బంధ పాఠశాలల కోసం నియమించనున్నట్లు తెలిపారు. ఇది ఉద్యోగ అవకాశాలను మెరుగుపరచడమే అవుతుంది.

మౌలిక సదుపాయాల కోసం 10లక్షల కోట్లు కేటాయించడం ద్వారా గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం 33శాతం అధికమని సీతమ్మ ప్రకటించారు. మౌలిక సదుపాయాలకు తగ్గట్లు చేయడం గొప్ప పరిణామం. 2013-14తో పోలిస్తే 9రెట్లు కేటాయింపులను పెంచుతూ 2.40 లక్షల కోట్లు రైల్వే మౌలిక సదుపాయాలను సమకూర్చనున్నట్లు ఆర్థిక మంత్రి లోక్‌సభ హర్షధ్వానాల మధ్య వివరించారు.

నగరాలలో మౌలిక సదుపాయాల రూపకల్పనకు, నేషనల్ హౌసింగ్ బ్యాంకు సహాయంతో బాండ్లను జారీచేసి సంవత్సరానికి 10,000కోట్ల వరకు సమకూర్చుకోబోతున్నట్లు పేర్కొన్నారు. మంచి ప్రతిపాదన ఇది!

లిథియం బ్యాటరీల తయారీకి ఉపయోగించే మిషనరీకి కస్టమ్స్ డ్యూటీ తగ్గిస్తున్నట్లు చెప్పారు. సిజిటిఎంఎస్ఇ క్రింద 2లక్షల కోట్ల ఋణాలను చిన్న, మధ్య తరగతి వ్యాపారస్తులకు అందజేయబోతున్నట్లుగా పేర్కొనడం అభినందనీయం. వ్యాపారస్తులు చేస్తున్న వ్యాపార విజయాలను గమనించి ఇచ్చే ఈ ఋణాలకు ఎలాంటి తనఖాలు అవసరం ఉండదు. దాంతో వ్యాపారాలు బాగా పుంజుకొనే అవకాశం కలుగుతుంది. టీవీలకు మరియు మొబైల్స్‌లో వాడే కొన్ని విడి భాగాలకు పన్ను రాయితీ కల్పించడం వల్ల వాటి ధరలు తగ్గి వినియోగం పెరుగుతుంది. మార్కెట్లకు ఊపు వస్తుంది.

చిన్న, మధ్య తరగతి వ్యాపారులకు పన్నుల విధింపులో ఉండే వెసులుబాటును 3కోట్లకు పెంచినట్లే పెంచి 95 శాతం లావాదేవీలు బ్యాంకు ద్వారా జరగాలని మెలికపెట్టడంతో పెంచిన సంతోషం మిగలకుండా పోయింది.

పల్లెల్లో బ్యాంకులకు వెళ్ళకుండా నగదు తీసుకోవడం (సెక్షను 26955 ప్రకారం) 20,000/- ఉన్న పరిమితిని 2,00,000/- వరకు పెంచడం సహకార సంఘాల పట్ల ప్రభుత్వం ఉదారత చూపించినట్లయింది.

ఇన్‌కంటాక్స్ పరిధిలోని చిన్న తగాదాలను పరిష్కరించడం కోసం కమిషనరు స్థాయి నుంచి తగ్గించి జాయింట్ కమిషనరు స్థాయి కోసం అధికారాన్నివ్వడం, అదీ వందమంది జాయింట్ కమిషనర్లను ఏర్పాటు చేయడం హర్షణీయం.

స్టార్టప్‌లకు వచ్చే నష్టాలు 7 సంవత్సరాలు చెల్లించకుండా పది సంవత్సరాల వరకు వెసులుబాటు కల్పించడం ఆనందదాయకం.

2020లో ప్రవేశపెట్టిన వ్యక్తిగత శ్లాబులను 5 నుంచి 6 శ్లాబులకు పెంచడం ఒక సదుపాయం. 0-3 లక్షలు నిల్, 3 - 6 లక్షలు 5%, 6 - 9 లక్షలు 10%, 9 - 12 లక్షలు 15%, 12 - 15 లక్షలు 20%, 15 లక్షలు 30% అయితే ఈ శ్లాబులు కొత్త విధానానికే కావడం పరిమితి విధించినట్లయింది. ఆశావహుల ఆశలపై ఈ విధంగా నీళ్ళు చల్లినట్లయింది.

ఇంతకుముందు గరిష్టంగా ఉండే పన్నురేటు 42.74 శాతం నుంచి 39 శాతానికి కుదించడం అభినందనీయం. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పన్నుల సంస్కరణల ద్వారా 3,000 కోట్ల ఆదాయాన్ని వదులుకోవలసిరావడం కొసమెరుపు అవుతుంది.

జిఎస్‌టి చట్టంలో పన్ను పరిధిలో లేకుండా వ్యాపారం చేసేవారికి వస్తుసేవా చట్టం ప్రకారం రిజిస్ట్రేషను అవసరం లేదని చెప్పడం ఎప్పటినుంచో ఉండే సమస్యకు పరిష్కారం చూపినట్లయింది.

జిఎస్‌టిలో రిటర్న్ దాఖలు పరిమితిని 3సంవత్సరాలకు కుదించడం కూడా సముచితంగా పేర్కొనవచ్చు. చిన్న వ్యాపారులను సైతం(కాంపోజిట్ డీలర్స్) ఇ-కామర్స్‌లో అమ్ముకోవడానికి వెసులుబాటు కల్పించడం అభినందనీయం.



**చిన్ని శ్రావణ్‌కుమార్**
చార్టెర్డ్ అకౌంటెంట్

## కాలధర్మం ఇందుపూరు సునందమ్మ



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ మండల కన్వీనర్ ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి ధర్మపత్ని సునందమ్మ(64) జనవరి 28వ తేదీ శనివారం గుండెపోటుతో కన్నుమూశారు. ఆమె మరణంతో ఆ కటుంబం తీరని వేదనకు గురైంది. రూరల్‌లో ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి అంటే తెలియని వారుండరు. ఆయనందరికీ సుపరిచితులే. అందులోనూ సహృదయులు. గతంలో పొట్టేపాళెం గ్రామ సర్పంచ్‌గా కూడా పనిచేశారు. ప్రజల మనిషిగా మంచిపేరు సంపాదించారు. నేటికీ రూరల్ మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఆయన తన అమూల్యమైన సేవలందిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు.. అచ్యుత శంకర్‌రెడ్డి, ఉదయ్‌శంకర్‌రెడ్డిలు. ఇద్దరూ కాంట్రాక్ట్ రంగంలో లబ్ధప్రతిష్టులుగా రాణిస్తున్నారు. సునందమ్మ మరణంతో వీరంతా శోకసాగరంలో మునిగిపోయారు. ఆమె ఆకస్మిక మరణానికి చింతిస్తూ, ఆ కుటుంబ సభ్యులందరికీ ప్రగాఢ సంతాపం తెలియజేస్తోంది..'లాయర్'!

## తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్‌గా..
# జేసీ కూర్మనాథ్

తెలుగుగంగ ఇన్‌చార్జి స్పెషల్ కలెక్టర్‌గా జిల్లా జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్‌ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు ఫిబ్రవరి 1న ఉత్తర్వులిచ్చారు. ఈ స్థానంలో ఇప్పటిదాకా విధులు నిర్వహిస్తున్న సుధాకర్ సెలవుపై వెళ్ళడంతో కలెక్టర్ ఈ నిర్ణయం తీసుకున్నారు.

# 'యువత' కు లోకేష్ దిశా నిర్దేశం చేస్తారా?

ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభ ఎన్నికలకు ఇంకా ఏడాదికిపైగా సమయం ఉండవచ్చుననే అంచనాతో, '400 రోజులు... 4000 కిలోమీటర్ల' పాదయాత్రకు తెలుగుదేశం ద్వితీయాధినేత నారా లోకేష్ శ్రీకారం చుట్టారు(కాంగ్రెస్ ఉత్తరాధికారి రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 136 రోజుల్లోనే ఈ దూరం–4000 కిలోమీటర్ల పైబడి నడిచారు). అంటే, లోకేష్ పాదయాత్ర వ్యవధి దాదాపు 13 నెలలు. ఈలోగా ఏ కారణం వల్లనైనా ఎన్నికలు ముంచుకు వస్తే, ఆయన పాదయాత్ర తదనుగుణంగా ఆగిపోవచ్చు.

లోకేష్ ఎంచుకున్న ఈ 13 నెలల కాలంలో ఒక మండు వేసవికాలం, ఒక వర్షాకాలం, ఒక చలికాలం ఉన్నాయి. ఈ మూడు కాలాలలోనూ... రోజుకు పది, పన్నెండు కిలోమీటర్లు నడవడం వల్ల...

- రాష్ట్రంలో మూడు ప్రాంతాల ప్రజల జీవన, వ్యవహారశైలిపై లోకేష్‌కు మంచి అవగాహన కలుగుతుంది.
- తన వయసు గ్రూప్ వారితో మంచి బాండింగ్ ఏర్పడుతుంది. ఈ సాన్నిహిత్యం భవిష్యత్‌లో(పార్టీలో తరం మారిన తరువాత..), లోకేష్‌కు బాగా అక్కరకు వస్తుంది.
- వివిధ నియోజకవర్గాల్లో పార్టీ లోటు పాట్లు, నాయకత్వ లేమి సమస్యలు, స్థితిగతులపై ఆయనకు ప్రత్యక్షంగా అవగాహన కలుగుతుంది. ఈ లోటుపాట్లను సరిదిద్దుకోడానికి ఏమేమి చేయాలనే విషయమై ఆయనకు ఓ స్పష్టత వస్తుంది. పార్టీని భవిష్యత్‌లో సమర్ధవంతంగా నిర్వహించడానికి ఇదో శిక్షణా కార్యక్రమంలా ఆయనకు ఉపయోగపడుతుంది. ఇది మొదటి లాభం.
- ఓ ఏడాదికి పైబడి.... అనుకూలంగానో, వ్యతిరేకంగానో రోజువారీ మీడియా ప్రచారంవల్ల, ఆయన పేరు జనం బుర్రలలో బలంగా నాటుకు పోతుంది. అందువల్ల, నెగటివ్ ప్రచారమూ ఆయన సుదీర్ఘ రాజకీయ ప్రయాణానికి మంచి పునాదే వేస్తుంది. నెగటివ్ ప్రచారం కూడా ఆయనకు లాభమే! ఈ విషయంలో మంత్రి ఆర్కే రోజా చేసే నోటి సహాయాన్ని తక్కువగా అంచనా వేయగూడదు. లోకేష్‌కు ఆవిడ 'వ్యతిరేక మిత్రురాలు'. (అనుకూల శత్రువుల కంటే, వ్యతిరేక మిత్రుల వల్ల ఉపయోగమే కానీ నష్టం ఉండదు)
- లోకేష్‌కు సహనం అలవడుతుంది. దూకుడు తగ్గుతుంది. (ఆ లక్షణాలు ఇప్పటికే కనిపిస్తున్నాయి).
- వీటన్నిటికీ మించి, లోకేష్ బాగా సన్నబడతారు. ఇప్పటికే సన్నబడ్డారు. ఇంకా నాజూగ్గా తయారవుతారు. వచ్చే 30, 35 ఏళ్ళ రాజకీయానికి అవసరమైన ఆరోగ్యం, శారీరక ధృడత్వం ఆయన సొంతం అవుతుంది.

ఇవి, కంటికి కనపడే ప్రయోజనాలు.

చిరుతపులి కళ్ళను గుర్తుకు తెచ్చే తీక్షణమైన కంటి చూపు, చిరు గడ్డం, మొహ కవళికలతో ... ముమ్మూర్తులా 1985ల నాటి చంద్రబాబునాయుడును గుర్తుకుతెస్తున్న నారా లోకేష్ 'యువ గళం'ను దేనికి వినియోగిస్తారు అనేది ఆసక్తికరం.

ఆయన పాదయాత్ర మొదలుపెట్టి, అప్పుడే వారం రోజులు అయిపోయింది. సుదీర్ఘ పాదయాత్రకు అవసరమైన బాడీ లాంగ్వేజ్ ఆయనలో కనపడుతోంది.

భుజాలపై ఆప్యాయంగా చేతులు వేసి, తోటి పాదచారులతో మాటా – మంతీ కలుపుకుంటూ నడవడం, సెల్ఫీలు దిగుతూ.... వడివడిగా అడుగులు వేయడం, నడక మధ్యలో చంటి బిడ్డల్ని ఎత్తుకుని ముద్దాడడం, మొదలైనవన్నీ.... పాదయాత్రకు ఓ సానుకూల వాతావరణం కల్పిస్తున్నాయి. గతంలో పాదయాత్రలు చేసిన వారు చేసినవే ఇవన్నీ.

అయితే, జీవితం ఆయనకు ఇచ్చిన ఈ సువర్ణావకాశాన్ని ఆయన ఎలా వినియోగించుకోబోతున్నారని పలువురు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. టీడీపీలో లక్షలాది మంది యువకులు ఉన్నప్పటికీ, లోకేష్ మినహా ఏ ఒక్కరికీ పాదయాత్ర చేయడం కుదరదు... తమ నియోజకవర్గం మినహాయించి. లోకేష్‌కు ఈ హక్కు పుట్టుకరీత్యా సంక్రమించింది. దీనిని ఆయన జగన్‌ను విమర్శించడానికి మాత్రమే వినియోగిస్తారా... లేక, ఈ కుళ్ళు రాజకీయాలకు అతీతంగా... ఒక మంచి సమాజ నిర్మాణానికి నాందిగా యువతను మోటివేట్ చేసే దిశగా ఆలోచిస్తారా అనేది చూడాల్సి ఉంది.

ఏ నాయకుడైనా ఒక్కసారే రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేయగలరు. అది కూడా చివరి అస్త్రంగా.

వై.ఎస్.రాజశేఖరరెడ్డి, చంద్రబాబునాయుడు, వైఎస్ జగన్ తమ తమ రాజకీయ ప్రయాణాలలో చివరి అస్త్రంగానే 'పాదయాత్ర'ను ప్రయోగించారు. కానీ, లోకేష్ ఇప్పుడు పాదయాత్రతోనే తన సుదీర్ఘ రాజకీయ ప్రయాణానికి శ్రీకారం చుట్టారు.

పాదయాత్ర దశకు రావడానికి ఆయనకు ఇంకా చాలా సమయం ఉంది. ఈసారి ఎన్నికల్లో అధికారంలోకి రావాలనే పట్టుదలతో ఉన్న తెలుగుదేశం పార్టీకి ఆయన అధినేత కాదు. తెలుగుదేశం గెలిస్తే, ఆయన ముఖ్యమంత్రి కారు. తెలుగుదేశం కూడా ఒంటరిగా కాకుండా, మరికొన్ని పార్టీలతో కలిసి కూటమిగా పోటీ చేయాలనే ఆలోచనలో ఉంది. ఒకవేళ విజయం సాధిస్తే, కూటమిలోని ఇతర పార్టీలతో కలిసి అధికారాన్ని అన్ని స్థాయిలలో పంచుకొనవలసి రావచ్చు. ఇవన్నీ.. పార్టీ అధినేతగా చంద్రబాబునాయుడు చూసుకోవలసిన అంశాలు.

ఈ పరిస్థితుల్లో... పార్టీ పటిష్ఠత, వ్యూహ... ప్రతివ్యూహాలపై తెర వెనుక నుంచి తండ్రికి చేదోడు వాదోడుగా ఉండవలసి ఉన్న నారా లోకేష్ పాదయాత్రకు ఉపక్రమించారు. బహుశా, ఎన్నికల ప్రకటన వచ్చే వరకు ఆయన పాదయాత్రలోనే ఉంటూ ఉండవచ్చు. మంచో... చెడో, పాదయాత్ర మొదలైపోయింది కనుక దానిని చరిత్రాత్మకం చేసే దిశగా లోకేష్ ఆలోచించాలి.

పాదయాత్ర లక్ష్యం ఏమిటి అనే విషయంలో లోకేష్‌కు స్పష్టత ఉండాలి.

ఆయన పాదయాత్ర నాలుగు వందల రోజుల పాటు ఎలా సాగాలి అనే విషయంలో టీడీపీ సీనియర్లు, శ్రేయోభిలాషులు, పెద్దలు ఆయనకేమైనా సలహాలు, సూచనలు ఇస్తున్నారేమో తెలియదు. కానీ, రాజకీయాలను మాట్లాడే పనిని, పార్టీలోని సీనియర్లకు ఆయన వదిలేయాలి.

గత వారం రోజులుగా సాగుతున్న పాదయాత్రలో లోకేష్ ప్రసంగాల సరళి చూస్తున్నప్పుడు ఇది 'రాజకీయ యాత్రే' అన్న భావన కలుగుతోంది.






ముఖ్యమంత్రి జగన్ వ్యవహార శైలిని విమర్శించడానికే లోకేష్ – ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు.

ఆయన ఒక్క విషయాన్ని గమనంలోకి తీసుకోవాలి. కయ్యానికైనా, వియ్యానికైనా సమ ఉజ్జీలు అయితేనే రంజుగా ఉంటుంది. వీరిద్దరూ సమ ఉజ్జీలు కాదు. వైసీపీకి కర్త, కర్మ, క్రియ, ఆక్సిజన్ జగన్ మాత్రమే. తెలుగుదేశంకు లోకేష్ ఇప్పుడు ప్రాక్టికల్‌గా ఏమీ కాదు. చంద్రబాబునాయుడి రాజకీయ వారసుడు.

పైపెచ్చు, ఎవరి విమర్శలనూ జగన్ లెక్క చేయరు. అది ఆయన మనస్తత్వం. ఆయన చేయాలి అని అనుకున్నది చేస్తారు.

ఈ మూడున్నరేళ్ళల్లో ఎంతమంది ప్రతిపక్ష నేతలు, మీడియా ఎన్ని అంశాలలో ఎంతగా విమర్శించినప్పటికీ ఆయన స్పందించిన సందర్భం దాదాపుగా లేదు.

తన మనసుకు నచ్చింది జగన్ చేస్తారు. చేస్తున్నారు. ఈ విషయం రాష్ట్ర ప్రజలకు తెలుసు. జగన్ పాలనాతీరుపై ప్రజలకు ఓ స్పష్టమైన అవగాహన ఏర్పడిందనడంలో సందేహం లేదు. ఆ అవగాహన ఆధారంగా జగన్‌ను, వైసీపీ అభ్యర్థులను గెలిపించాలో... వద్దో వారు నిర్ణయిస్తారు.

అంతే తప్ప, లోకేష్ విమర్శించడం వల్ల, జగన్‌కు ఒక ఓటు అదనంగా పోదు. విమర్శించకపోవడం వల్ల, ఆయనకు లాభం కలగదు. జగన్‌ను గురించి జనానికి ఇప్పటివరకు తెలియని కొత్త విషయం... కొత్త విమర్శ లోకేష్ ఏమి చెబుతున్నారు? ఏ కొత్త సెటైర్ వేస్తున్నారు? లోకేష్ ఆలోచించాలి.

లోకేష్ యువకుడు. రాష్ట్రంలో కనీసం రెండు కోట్ల మందికి తక్కువ లేకుండా యువత ఉంటారు. టీడీపీలోనే యువ కార్యకర్తలు లక్షల సంఖ్యలో ఉంటారు. తన పాదయాత్రకు 'యువ గళం' అనే అద్భుతమైన పేరుపెట్టిన లోకేష్.. ఈ లక్షలు, కోట్లమంది యువతకు ఏమి సందేశం ఇవ్వబోతున్నారో ఆలోచించాలి.



కేవలం జగన్మోహనరెడ్డిని, ఆయన ప్రభుత్వాన్ని విమర్శిస్తూ కాలక్షేపం చేయడానికి.... ఇన్ని రోజుల పాటు, ఇన్ని వేల కిలోమీటర్ల మేర ఎండల్లో... వానల్లో... చలిలో తిరగడం ఎందుకు?

టీడీపీ ఆఫీస్‌లో కూర్చుని విమర్శిస్తే సరిపోదా? ఇన్నాళ్ళు చేసింది కూడా అదే కదా!

జగన్‌కు ప్రజలు 2019లో ఒక అవకాశం ఇచ్చారు. జగన్, తన పద్ధతిలో తాను వెడుతున్నారు. రాజకీయాలలోకి రాక ముందు, వచ్చిన తరువాత పార్టీ ఏర్పాటు చేయకముందు, చేసిన తరువాత ప్రతిపక్ష నాయకుడు కాకముందు, అయినా తరువాత ఇప్పుడు ముఖ్యమంత్రి అయిన తరువాత.. ఆయన ఒకే రకమైన వ్యవహారశైలితో ఉన్నారు. ఆయనను అర్థం చేసుకోవడంలోనే తేడాలు. ఒక్కొక్కరికి ఒక్కొక్క రకంగా ఆయన కనపడుతున్నారు.

ఓటర్లలో, పార్టీలో, ఉన్నత స్థాయి అధికార యంత్రాంగంలో, దిగువ, మధ్య స్థాయి ఉద్యోగులలో, పోలీసు వ్యవస్థలో ఆయనను గెలిపించడం కోసం ప్రాణంపెట్టి పనిచేసే వారు కనీసం పాతిక శాతం మంది ఉన్నారని... ఒక వైసీపీ వ్యతిరేకపార్టీ నాయకుడే చెప్పారు. నిజంగా అది నిజం కూడా. అంత 'కమిటెడ్' ఫాలోయింగ్... జగన్‌కు తప్ప,రాష్ట్రంలో మరో నేతకు లేదు.

అందువల్ల, లోకేష్.. తన దృష్టి పెట్టాల్సింది జగన్‌పై కాదు. రాజకీయాలకు అతీతంగా... రాష్ట్ర పునర్నిర్మాణంలో యువతను భాగస్వాములను చేయడం ఎలా అని ఆలోచించాలి.

మాట వరుసకు, ఆయన ఒక గ్రామం వెళతారు. ఆ ఊళ్ళో రోడ్లు బాగుండవు. బ్రిడ్జి పడిపోయేట్టుంది. కరెంట్ తీగెలు, స్తంభాల పైనుంచి వేళ్ళాడుతూ కనిపించాయి. స్కూల్ బిల్డింగ్ పడిపోయేట్టు ఉంది. పశువుల ఆసుపత్రి కూడా లేదు. ఓ యాభై మంది డిగ్రీ పాసైన పిల్లలు ఉన్నారు గానీ, ఉద్యోగాలు లేక... గెడ్డాలు పెంచేసుకుని, పంచాయతీ ఆఫీస్ అరుగుల మీద కాలక్షేపం చేస్తున్నారు.

ఇలాటి గ్రామాల గుండానే లోకేష్ పాదయాత్ర సాగుతూ ఉండి ఉండవచ్చు. లోకేష్ వారికి దిశా నిర్దేశం చేయాలి. గ్రామస్థుల శ్రమదానం, లేదా మరో సహకారం ద్వారా ఆ గ్రామం ఎదుర్కొంటున్న కామన్ సమస్యల పరిష్కారానికి ఆ గ్రామ యువత నడుం బిగించే విధంగా లోకేష్... వారిని మోటివేట్ చేయాలి.

ప్రభుత్వాన్ని విమర్శించడం తేలిక. ఇలా మోటివేట్ చేయడం కష్టం.

తన పాదయాత్ర సందర్భంగా కనీసం రెండు మూడు లక్షల మంది యువతీ యువకులను లోకేష్ ప్రత్యక్షంగా కలుసుకునే అవకాశం ఉంది. రాజకీయాలకు అతీతంగా,రాష్ట్ర పునర్నిర్మాణానికి వారిని మోటివేట్ చేయడం ద్వారా లోకేష్ – భవిష్యత్ పాదయాత్రికులకు ఒక మార్గం చూపినవారు అవుతారు. అంతే గాక తెలుగుదేశం పగ్గాలు తన చేతికి వచ్చిన తరువాత, అవసరం అనుకుంటే... రాజకీయకారణాలతో మరోసారి పాదయాత్రకు ఉపక్రమించవచ్చు.

అలా కాక, జగన్‌ను విమర్శించడానికో, ఆయనపై సెటైర్లు వేయడానికో ఈ పాదయాత్ర అనుకుంటే... టీవీ వీక్షకుల వినోదానికి మాత్రమే అది ఉపయోగపడుతుంది. అంతటి భగీరథ ప్రయత్నానికి రావలసిన గౌరవం, హుందాతనం రావు. ఓ పిల్ల చేష్టగా మిగిలిపోతుంది.

తెలుగుదేశం పార్టీలో ఆయన ఇప్పుడు ఉత్తరాధికారే. చంద్రబాబునాయుడేమీ 'పొలిటికల్ రిటైర్మెంట్' ప్రకటించలేదు. వచ్చే ఎన్నికల వరకే కాదు వాటి ఫలితాలతో సంబంధం లేకుండా.... ఆ తరువాత వచ్చే ఎన్నికల వరకు కూడా ఆయన చురుకుగానే ఉంటారు.

అందుకే, యువతతో కనెక్ట్ అవడానికి, వారిని రాష్ట్ర పునర్నిర్మాణ దశగా మోటివేట్ చేయడానికి లోకేష్... తన పాదయాత్రను అంకితం చేయాలి. రాజకీయాలు ఎందుకు?

ఆ పనికి చంద్రబాబు, యనమల రామకృష్ణుడు, అచ్చెన్నాయుడు, వర్ల రామయ్య, జవహర్, ఆనందబాబు, కొమ్మారెడ్డి పట్టాభిరామ్, కొల్లు రవీంద్ర, నిమ్మల రామానాయుడు, (పెద్ద సైజు)చింతకాయల అయ్యన్న పాత్రుడు, (చిన్న సైజు) నిమ్మకాయల రాజప్ప వంటి పలువురు నోరు తిరిగిన నేతలు ఉండనే ఉన్నారు కదా!

పాదయాత్ర చేపట్టడం వెనుక లోకేష్‌కు గల ఉద్దేశాలను ప్రజలు విశ్లేషిస్తారు అని లోకేష్ బృందం గమనించాలి. అందుకే, అడుగడుగునా ఆయన మాటల్లో నిజాయతీ కనిపించాలి. వాగ్దానాలు, హామీల జోలికి వెళ్ళగూడదు.

– భోగాది వేంకట రాయుడు
bhogadirayudu2152@gmail.com

# ఉత్తరక్రియలు



జననం
24.10.1931

నిర్యాణం
25.01.2023

అనురాగమూర్తి, ఆత్మీయదీప్తి

## శ్రీమతి పెనాక లక్ష్మీనారాయణమ్మ గారు

25.01.2023 బుధవారం నాడు స్వర్గస్తురాలైనారు.

## పెద్దకర్మ

**తేది: 04.02.2023** శనివారం ఉదయం 11.30గంటలకు హైదరాబాద్, జూబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్‌లోని నార్నె రోడ్, సర్వేనెం.4లో గల **జె.ఆర్.సి కన్వెన్షన్ సెంటర్** నందు జరుగును. కావున తెలియజేయడమైనది.

వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

*శోకతప్త హృదయాలతో...*

కుమారులు - కోడళ్ళు

**పి.వి.రామ్‌ప్రసాద్‌రెడ్డి - సునీల రాణి**

**పి.గోపినాథ్‌రెడ్డి - వరలక్ష్మి**

కుమార్తెలు - అల్లుళ్ళు

**బి.సరళ - బి. శివప్రసాద్‌రెడ్డి**

**టి. రమాదేవి - టి. సత్యనారాయణరెడ్డి**

మనవళ్ళు

**పి.శరత్‌చంద్రారెడ్డి, పి.రోహిత్‌రెడ్డి**

మరియు **మునిమనుమళ్ళు, మునిమనుమరాళ్ళు**

Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com